ప్రజాశక్తి
గురువారం 24 జులై 2025 8 పేజీలు




ప్రకాశం బాపట్ల

నల్లబర్లీ పొగాకు సాగు నిషేధం

బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లాలో ఈ ఏడాది నల్లబర్లీ పొగాకు సాగును పూర్తిగా నిషేధించినట్లు జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి స్పష్టం చేశారు. ఈ ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన మార్క్‌ఫెడ్, వ్యవసాయ శాఖ అధికారులు, ప్రైవేట్ బయ్యర్లతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత సీజన్‌లో పొగాకు కంపెనీల హామీలతో రైతులు భారీగా బ్లాక్ బర్లీ పొగాకు సాగు చేశారని తెలిపారు.కొనుగోలు సమయంలో కొన్ని కంపెనీలు వెనకడుగు వేసిన నేపథ్యంలో రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం ముందుకొచ్చిందన్నారు. డిమాండ్‌కు మించి పంట సాగు చేయడం వల్ల ధరలు గణనీయంగా పడిపోయినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఈసీజన్‌లో బ్లాక్‌బర్లీ పొగాకు సాగు చేయరాదని తెలిపారు. నర్సరీల్లోనూ బ్లాక్ బర్లీ పొగాకు నారు సాగు నిషేధమని స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘించి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట మురళి

ఎవరైనా పంట సాగు చేస్తే వ్యవసాయ శాఖ అధికారులు పంటను ధ్వంసం చేయడంతో పాటు నేరుగా చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. రైతులు ప్రత్యామ్నాయ, లాభదాయక పంటలపై దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ఈ పాటికే పండించిన బ్లాక్ బర్లీ పొగాకును రైతులు ప్రైవేట్ కంపెనీలకు విక్రయించవచ్చని కలెక్టర్ తెలిపారు. వర్షాల ప్రభావం నుంచి రైతులు పండించిన పొగాకు పంటను రక్షించుకోవాలని, తేమ 20 శాతం ▶ 2లో

సంతమాగులూరులో తండ్రీ,కొడుకు దారుణ హత్య

రియల్ ఎస్టేట్ వ్యాపారంలో విభేదాలే కారణం

▶ మెయిన్ ఫస్ట్ పేజీలో..

ట్రంకు రోడ్డు విస్తరణకు చర్యలు

- ఎమ్మెల్యే జనార్ధన్

వంద అడుగుల ప్రతిపాదన

- 70 అడుగులకు కుదించాలని

వ్యాపారుల వినతి



వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెలే దామచర్ల జనార్ధన్

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

జిల్లా కేంద్రమైన ఒంగోలులో కీలక వ్యాపార రహదారిగా ఉన్న ట్రంకురోడ్డు విస్తరణపై చర్చలు నడుస్తున్నాయి. ఇప్పటికే పలు దఫాలుగా దీనిపై ఎమ్మెల్యే దామచర్ల సంబంధిత వ్యాపారులతో చర్చలు జరిపారు. మంగళవారం రాత్రి కూడా మరోసారి వారితో భేటీ అయ్యారు. రోడ్డు విస్తరణపైనే చర్చ సాగింది.మాస్టర్ ప్లాన్ ప్రకారం 100 అడుగులు విస్తరిస్తే భవిష్యత్‌లో ఎలాంటి విస్తరణ సమస్య తెరపైకి రాకుండా ఉంటుందని ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ వ్యాపారులకు స్పష్టం చేశారు. విస్తరణ చేసేటప్పుడు అన్ని విధాలా ఉపయోగంగా ఉండాలే తప్ప ఏదో చేశామంటే చేశామన్నట్లుగా ఉంటే నష్టం తప్పలాభం లేదని వారికి సూచించారు. విస్తరిస్తే వ్యాపారాలు పెరుగుతాయని, దుకాణాలు పూర్తిగా పోయేవారికి పాతమార్కెట్ సెంటర్‌లో నిర్మించే షాపింగు కాంప్లెక్సులో దుకాణాలు కేటాయిస్తామని జనార్దన్ వ్యాపారులకు సూచించారు. మాస్టర్‌ప్లాన్ ప్రకారం 100 అడుగుల విస్తరణకు అందరూ సహకరించాలని కోరారు. వ్యాపారులు ఎట్టకేలకు విస్తరణకు అంగీకరించారు. ఎంత వెడల్పు చేయాలన్న దానిపైనే వ్యాపారుల్లో తర్జనభర్జన సాగుతోంది. హెచ్‌సిఎం కాలేజీ వద్ద ఎంత వెడల్పుఉందో అంత చేయాలని సూచించారు. అక్కడ 70అడుగులకుపైగా వెడల్పు ఉన్నట్లు తేల్చారు. ఆ ప్రకారం విస్తరణ చేస్తే వ్యాపారులు ఎక్కువ నష్టపోకుండా ఉంటారని ప్రతిపాదించారు. మాస్టర్‌ప్లాన్ ప్రకారం ముందుకుపోవాల్సిందేనని ఎమ్మెల్యే గట్టిగానే చెప్పారు. దీనిపై మరోసారి చర్చల్లో తుది నిర్ణయానికి వచ్చే అవకాశం ఉంది. పాత మార్కెట్‌లో దుకాణాలు నిర్మాణం చేపట్టాకే విస్తరణ చేయాలని వ్యాపారులు సూచించారు. అక్కడ షాపింగు కాంప్లెక్సు కట్టాలంటే రెండేళ్లయినా పడుతుంది. అప్పటి వరకూ విస్తరణ ఆపడం సాధ్యం కాదనే భావన ఎమ్మెల్యే వ్యక్తం చేశారు.విస్తరణలో పూర్తిగా దుకాణాలు పోయేవారికే మార్కెట్‌లో కట్టే కాంప్లెక్స్‌ల్లో అవకాశం కల్పిస్తామని దామచర్ల స్పష్టం చేశారు. సగం దుకాణం పోయిన వారికి కూడా అక్కడ కేటాయించాలని వ్యాపారులు సూచించారు. అక్కడ దుకాణాలు సరిపోవనే చర్చ నడుస్తోంది. విస్తరణపై ఎమ్మెల్యే దామచర్ల గట్టిపట్టుదలతోనే ఉన్నారు.మరోవైపు కార్పోరేషన్ అధికారులు కూడా దీనికి సంబంధించిన కసరత్తు చేపట్టారు. ఈనెల 30న నిర్వహిస్తున్న కౌన్సిల్ సమావేశంలోనూ రహదారుల విస్తరణ అంశాన్ని ఎజండాగా పెట్టారు. కౌన్సిల్ ఆమోదం కోసం ప్రతిపాదించారు. ఆమోదించాక విస్తరణ పనులు మొదలవుతాయని భావిస్తున్నారు. ఈలోపే వ్యాపారులతో చర్చలు జరిపి ఎంత విస్తరించాలనేదానిపై ఓ నిర్ణయానికి రావాల్సిఉంది. మాస్టర్‌ప్లాన్ ప్రకారం పోతారా?లేక మరేదైనా నిర్ణయం తీసుకుంటారా?అన్నది ఎమ్మెల్యే దామచర్ల నిర్ణయంపై ఆధారపడింది.



ఒంగోలు ట్రంక్ రోడ్డు ఇదే..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక విధానాలపై

సమరశీల పోరాటాలు

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి

ప్రజాశక్తి -బాపట్ల

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై సమశీల పోరాటలు నిర్వహించాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి తెలిపారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య ప్రజాసంఘాల కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజలందరూ ఐక్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను వ్యతిరేకించాలన్నారు. బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు లాభం చేకూర్చే విధంగా అవలంబిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు అమలులో ఘోరంగా విఫలమైందన్నారు. రాజధాని నిర్మాణానికి తగిన నిధులను కేంద్రం నుంచి రాబట్టటంలో ఘోరంగా విఫలమైందన్నారు. ప్రపంచవ్యాప్తంగా చోటు చేసుకుంటున్న అనేక పరిణామాలతో యువత లెఫ్ట్ భావజాలం వైపు ఆకర్షితులవుతున్నారన్నారు. దేశంలో, ప్రపంచంలో 1990 తర్వాత కమ్యూనిస్టు ఉద్యమం బలహీనపడిన నేపథ్యంలో సోషలిస్ట్ కూలిపోయిన తర్వాత ప్రపంచవ్యాప్తంగా లెఫ్ట్ భావజాలం వెనక్కి తగ్గిందన్నారు. చుట్టూ ఉన్న సమస్యలే యువతను తిరిగి సోషలిజం వైపు ఆకర్షిస్తున్నాయన్నారు. ఇటీవలలె ట్రంప్ చేసిన ఓ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమంలో యువత భారీ ఎత్తున పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో నిర్వహించిన సర్వేలో 62 శాతం మంది యువత సోషలిజం కావాలని కోరు కుంటున్నారన్నారు. ప్రభుత్వాలు అవలంబిస్తున్న ▶ 2లో



అచ్యుతానందన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రమాదేవి

పేదరికం లేని సమాజం కోసం

మార్గదర్శకులు సహకరించండి

కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

పేదరికం లేని సమాజ ఆవిష్కరణ కోసం పి4 పథకంలో మార్గదర్శకులుగా నిలిచి మీ వంతు సహకారం అందించాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, పరిశ్రమలు, గ్రానైట్ సంఘాల ప్రతినిధులు, ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు, ఎరువులు, రసాయనాలు, పాల డెయిరీల యజమానులతో ప్రకాశం భవనంలో బుధవారం వేరువేరుగా పత్యేక సమావేశం నిర్వహించారు. పి4పై పథకం గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జడ్‌పి సిఇఒ చిరంజీవి వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో అభివద్ధిపరంగా పైస్థాయిలో ఉన్న 10 శాతం ప్రజలు కిందిస్థాయిలో పేదరికంతో బాధపడుతున్న 20 శాతం కుటుంబాలకు రకాలుగా చేయూతనిచ్చి పేదరికాన్ని ఆయా కుటుంబాలు అధిగమించేలా చూడడమే పి4 పథకం ఉద్దేశమని తెలిపారు. ఈ దిశగా చేయూత అవసరమైన కుటుంబాలు జిల్లాలో 74 వేలకు పైగా ఉన్నట్లు గుర్తించామన్నారు. వాటిని బంగారు కుటుంబాలుగా పేర్కొంటున్నట్లు చెప్పారు. ఆయా కుటుంబాలకు వెన్నుదన్నుగా నిలిచే వారిని మార్గదర్శకులు అని పేర్కొంటున్నట్లు తెలిపారు. మార్గదర్శకులు ఆర్థిక సహాయమే చేయాలన్నది ఈ పథకం ఉద్దేశం కాదని, బంగారు కుటుంబాలు పేదరికాన్ని అధిగమించేలా వివిధ రకాలుగా ' మార్గదర్శకం ' చేయాల్సి ఉంటుందన్నారు. సంక్షేమ పథకాలకు అదనంగా ఇతర సహాయం ఏమైనా బంగారు కుటుంబాలకు అవసరమని గుర్తిస్తే, ఆ దిశగా సహాయం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. స్వర్ణాంధ్ర - 2047 కోసం రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన విజన్ యాక్షన్ ప్లానులో పది సూత్రాలను రూపొందించారని కలెక్టర్ తెలిపారు. పేదరిక నిర్మూలన ఇందులో ఒకటి అని చెప్పారు. పి4 కార్యక్రమం ద్వారా పేదరికం లేని సమాజాన్ని రూపొందించాలనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనలు, ఆశయ సాధనకు అనుగుణంగా సహాయం చేసే శక్తి ఉన్న వారందరూ తమ వంతు బాధ్యత తీసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సమాశంలో జడ్‌పి సిఇఒ ▶ 2లో



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

నల్లబర్లీ పొగాకు సాగు నిషేధం

(మొదటిపేజీ తరువాయి)

కేంద్రాలకు తీసుకురావద్దని స్పష్టం చేశారు. రైతులు ఎలాంటి అపోహలకు లోను కాకుండా ప్రభుత్వంపై నమ్మకంతో ఉండాలన్నారు. ప్రతి రైతుకు ప్రభుత్వం అండగా ఉంటుందని కలెక్టర్ భరోసా ఇచ్చారు. ప్రతి రైతు పండించిన చివరి ఆకు వరకు కొనుగోలు చేస్తామని తెలిపారు.పొగాకు రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కలెక్టర్ తెలిపారు.

బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలుకు ప్రత్యేక కమిటీలు

బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలుకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసినట్లు జికలెక్టర్ వెంకట మురళి తెలిపారు. గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకూ కమిటీలు వేసినట్లు చెప్పారు. గ్రామ స్థాయిలో వ్యవసాయ సహాయకులు, మండలంలో తహశీల్దార్లు, డివిజన్ స్థాయిలో ఆర్‌డిఒలు, జిల్లా స్థాయిలో కలెక్టర్ కమిటీలకు నేతత్వం వహిస్తారని తెలిపారు.

పేదరికం లేని సమాజం కోసం
మార్గదర్శకులు సహకరించండి

(మొదటిపేజీ తరువాయి)

బి.చిరంజీవి, డిఇఒ కిరణ్ కుమార్, సిపిఒ స్వరూపరాణి, గనుల శాఖ డిడి రాజశేఖర్, జిల్లా పరిశ్రమల సంస్థ మేనేజర్ శ్రీనివాసరావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవికుమార్, డిఎంఅండ్ హెచ్ఒ వెంకటేశ్వర్లు, డిసిహెచ్ఎస్ శ్రీనివాస నాయక్, ఎన్‌టిఆర్ వైద్యసేవ జిల్లా సమన్వయకర్త డాక్టర్ హేమంత్, ఔషధ నియంత్రణ శాఖ డీడీ జ్యోతి, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, జిల్లా ఉద్యాన అధికారి గోపీచంద్, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు, ఎంపిఎంఐపి పీడీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్షయ బాధితుల కోసం విరాళం

క్షయ బాధితులకు మంచి పోషకాహారం కోసం 12 గ్రానైట్ పరిశ్రమల యజమానులు రూ.2,60,000 విరాళంగా ఇచ్చారు. కలెక్టర్ చేతుల మీదగా జిల్లా క్షయ నివారణ అధికారి శ్రీవాణికి ఈ విరాళం అందజేశారు. విరాళం ఇచ్చిన దాతలకు కలెక్టర్ ప్రశంసా పత్రాలు అందించారు.

క్రమశిక్షణతో చదవాలి

ప్రజాశక్తి-దర్శి

విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే విజయం వరిస్తుందని సీఐ వై రామారావు అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంచి చెడులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి మంచిని స్వీకరించాలని చెడులకు దూరంగా ఉండాలన్నారు. తమహక్కులు విధులు గురించి విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. ఎవరైనా ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే నేరుగా పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయవచ్చునన్నారు.

విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఆపరేషన్ సింధూర్ పేరుతో తీవ్రవాదుల దాడిని భారతదేశ సైన్యం ఎలా ఎదుర్కొందో ఎన్‌సిసి క్యాడెట్లకు 34ఏ ఎన్‌సీసీ బెటాలియన్ ఒంగోలుకు చెందిన కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ మోహన్ వివరించారు. ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కాలేజీలో ఆపరేషన్ సింధూర్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కళాశాలలోని విశ్వేశ్వరయ్య సెమినార్ హాలులో బుధవారం ఈ కార్యక్రమం జరిగినట్లు విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీగాయత్రి తెలియజేశారు. జమ్మూ కాశ్మీర్‌లో పరిస్థితులు ఎలా ఉంటాయి? పెహల్గామ్‌లో అటాక్స్ ఎలా జరిగాయి? ఆ తర్వాత ఆపరేషన్ సింధూర్‌ని ఎలా నిర్వహించారు? తదితర అంశాలపై క్యాడెట్స్‌కి తెలియజేశారు. ఎన్‌సీసీ క్యాడెట్లు ఇలాంటి విషయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. క్విస్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లతో పాటు క్విస్ స్కూల్ ఎన్‌సీసీ క్యాడెట్లు, వివిధ కళాశాలలకు చెందిన 400 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు హాజరయ్యారు.

సిఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే ఉగ్ర



సిఎంను కలిసిన ఉగ్ర

ప్రజాశక్తి-కనిగిరి: సీఎం నారా చంద్ర బాబు నాయుడును అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహరెడ్డి కలిశారు. సీసీ రోడ్లు, తాగునీరు, ఆర్‌అండ్‌బి రోడ్లు, డ్రైన్లు తదితర అభి వృద్ధి పనులకు నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రిని కోరగా సానుకూలంగా స్పందించినట్లు ఆయన పేర్కొన్నారు. కనిగిరి అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయింపుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. వెనుకబడిన కని గిరి ప్రాంత అభివృద్ధికి తాను నిరంతరం శ్రమిస్తున్నట్లు తెలిపారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై
సమరశీల పోరాటాలు

(మొదటి పేజీ తరువాయి)

విద్యుత్ విధానాలు పెట్టుబడిదారులకు లాభాల కోసమే తప్ప ప్రజల సంక్షేమంపై కోసం కాదని స్పష్టమవుతుందన్నారు. నెల్లూరు యాక్సిస్ బ్యాంక్ కుంభకోణంలో కోట్లాది రూపాయల నిధులు గోల్‌మాల్ అయినట్లు తెలిపారు. బ్యాంకు అధికారులుతో స్థానిక రాజకీయ నాయకులు కుమ్మక్కు కావడం వల్లే ఈ కుంభకోణానికి దారితీసిందన్నారు. ప్రభుత్వం దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు. వైసిపి పాలనలో ప్రవేశపెట్టిన రేషన్ వాహనాలను తీసేసి కూటమి ప్రభుత్వం అక్రమ రేషన్‌కు ప్రత్యక్షంగా తెర తీసిందన్నారు. అక్రమ రేషన్ దందా విషయంలో గత ప్రభుత్వం బాటలోనే కూటమి ప్రభుత్వం నడుస్తుందని విమర్శించారు. యువత ముందుకొచ్చి కమ్యూనిస్టు వాదులు చేపడుతున్న ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. తొలుత కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్ చిత్ర పటానికి నివాళులర్పించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు మాల్యాద్రి, జిల్లా కార్యదర్శి గంగయ్య, నాయకులు కృష్ణ మోహన్, మణిలాల్, బాబూరావు మజుందర్ పాల్గొన్నారు.

దరిశి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A.NO.87/2024

In

A.S.NO.

శ్రీ రాం రామారావు ...పిటీషనర్

Vs

అన్నా రెడ్డి నారాయణరెడ్డి ...రెస్పాండెంట్

To.

అన్నా రెడ్డి నారాయణరెడ్డి తండ్రి గంగిరెడ్డి,
పొదిలి రోడ్, దరిశి, దరిశి (గ్రామం) (మండలం)
ప్రకాశం జిల్లా.

పిటీషనరు అప్పీలు దాఖలు చేయుటలో గల ఆలస్యమును మన్నించమని కోరుచూ పిటిషను దాఖలు చేయగా, మీయొక్క హాజరు నిమిత్తం తేదీ: 30.07.2025 వాయిదా అయి ఉన్నది. సదరు తేదీన అనగా 30.07.2025 ఉదయం 10.30 ని॥లకు మీరు గాని, మీ తరపు లాయర్ గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది: 30.07.2025

ఇట్లు
వి. రమణారెడ్డి
పిటిషనరు తరపు న్యాయవాది
దరిశి, ప్రకాశం జిల్లా.
సెల్:9441275441

మహారాజశ్రీ ఒంగోలు ప్రిన్సిపల్ జూరియర్ సివిల్ జడ్జి వారి కోర్టు

O.S.No. 627/2021

యగటీల మాధవీలత ...వాది

Vs

1. నర్రా జానకమ్మ వగైరాలు ...ప్రతివాదులు

6వ ప్రతివాది:

స్టేట్ గవర్నమెంట్ కోఆపరేటివ్ హౌస్ కన్‌స్ట్రక్షన్ సొసైటీ లిమిటెడ్, ఒంగోలు తరపున వారి ఛైర్మన్.

పై దావాలో 6వ ప్రతివాది అయిన మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు ఆర్డరు వేసినారు. పై దావా తేది: 20-08-2025నకు వాయిదా అయి ఉన్నది. కావున 20-08-2025వ తేదీన ఉదయం గం. 10.30 ని॥లకు పై కోర్టువారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనేది. లేని ఎడల మీ పరోక్షమున పై దావాను తీర్మానించబడునని తెలుసుకొనేది.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

తేది: 23-7-2025

ఇట్లు
గుడ్లదొన చంద్రశేఖర్,
అడ్వకేట్, ఒంగోలు.

పత్రికా ప్రకటన

దస్తావేజులు పోయినవి

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా. నా తాలూకు (వేముల నాగేశ్వరరావు, S/o. పెద్ద కొండయ్య అను పేరుమీద) అద్దంకి సబ్-రిజిస్ట్రారు వారి కార్యాలయములో రిజిస్టరు కాబడిన ఒరిజినల్ రిజిష్టరు దస్తావేజులు
(1) దస్తావేజు నం. 1074/2002, తేది:21-6-2002,
(2) దస్తావేజు నం. 2771/2001, తేది 6-12-2001
(3) దస్తావేజు నం. 2770/2001, తేది-6-12-2001

మా క్లయింటు 9-7-2025వ తేదిన తన ఇంటినుండి జిరాక్స్ సెంటర్ వద్దకు వెళుతున్న సమయంలో దారి మధ్యలో పోయినవి, సదరు దస్తావేజులు కొరకు నేను ఎంత వెతికించిననూ దొరకలేదు. కావున పై తెలిపిన దస్తావేజులు ఎవరికైనా దొరికిన యడల ఈ క్రింద ఇవ్వబడిన ఫోన్ నంబరుకు సమాచారం అందించాలని కోరుతున్నాము.

ఇట్లు
వేముల నాగేశ్వరరావు
అద్దంకి, బాపట్ల జిల్లా
ఫోన్ నం. 6302273969

జనరల్ నోటీసు

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జిల్లా జడ్జివారి కోర్టులో, ఒంగోలు

G.W.O.P.No. 21/2024

Between:

నల్లమల్లి సౌజన్య దేవి ...పిటీషనరు

Vs

నల్లమల్లి రామ్ కుమార్ ...రెస్పాండెంట్

నల్లమల్లి సాయి స్మరణ్ మరియు నల్లమల్లి సాయి సురేష్‌లకు తను గార్డియన్ అని నల్లమల్లి సౌజన్యదేవి పై నెంబరు పిటిషను దాఖలు చేసి మైనర్లు అయిన సాయి స్మరణ్, సాయి సురేష్ లపేరున ఉన్న షెడ్యూలు దాఖలా ఆస్థిని వారి విద్య మరియు ఇతర అవసరముల నిమిత్తం విక్రయించుటకు అనుమతి కోరియున్నారు. కాన సదరు అనుమతి ఇచ్చుటకు ఎవరికైననూ ఎట్టి అభ్యంతరములు ఉన్నయడల తేది: 28-07-2025 ఉదయం 10 గంటల 30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు తెలుపుకొనగలరు.

షెడ్యూలు

ప్రకాశం జిల్లా రిజిస్ట్రేషన్ – ఒంగోలు సబ్ రిజిస్ట్రేషన్ – ఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్ – పోతురాజుపాలెం అన్నవరప్పాడు – 6వ వార్డు – 6వ బ్లాకు – స.నెం. 105 – ప్లాటు నెంబరు 87 – తూరు 45 గదుల 13 చ.అ. ఖాళీ స్థలమునకు హద్దులు.
తూర్పు: 40 అడుగుల రోడ్డు.
దక్షిణం: 40 అడుగుల రోడ్డు.
పడమర: ప్లాటు నెంబరు 87తాలూకు మిగులు స్థలం
ఉత్తరం: ప్లాటు నెం. 88
ఈ హద్దులలోని 3250 చ.అ. స్థలం లేదా 361.1 చ. గ॥ల స్థలం.

//పై కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//

నరసింగోలు శ్రీనివాస్ ప్రసాద్,
అడ్వకేట్,
ఒంగోలు

మహారాజశ్రీ ఒంగోలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P.No. 5/2025

IN

O.S.NO. 403/2018

నీరుకట్టు సురేష్ ...డిక్రీ హోల్డర్

మరియు

పెద్దిపాటి మంగళ గౌరీ ...జడ్జిమెంట్ డెటార్

To:

పెద్దిపాటి మంగళ గౌరీ,
W/o. పి.మనోహర్, ప్లాట్ నెంబర్ A- 305,
దివ్య సాయి శ్రీనిధి అపార్ట్ మెంట్, సమతా నగర్,
ఉషోదయ పబ్లిక్ స్కూల్ ఎదురు,
కర్నూలు రోడ్డు, ఒంగోలు.

పై నెంబర్ EP లో డి.హెచ్.ఆర్, మీపై డిక్రి పైకము వసూలు నిమిత్తము మీ ఆస్తిని వేలం వేయుటకు CPC లో ఆర్డర్ 21 రూల్66 ప్రకారం నోటీసులు పంపినను మీకు జారీ కానందున కోర్టు వారు పేపర్ ప్రకటన ద్వారా నోటీసు ఆర్డర్ చేసియున్నారు కావున పై తెలిపిన కోర్టు తేదీ 01.08.2025 న ఉదయం 10.30 గంటలకు స్వయంగా గాని లేక వకీలు ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెయను లేనియెడల మీ పరోక్షమునందు తీర్మానించబడునని తెలియ జేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా తేది 01.08.2025

ఇట్లు
సి. శివకుమార్
DHR తరపున అడ్వకేట్
ఒంగోలు
సెల్: 9985872659

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో : ఒంగోలు

O.S.No. 529/2019

Between:

మద్ది వేణు గోపాల్ ...వాది

మరియు

1. గాదంశెట్టి సౌభాగ్యము మరియు ఇతరులు ...ప్రతివాదులు

To.

D1: గాదంశెట్టి సౌభాగ్యము,
W/o. Late వెంకట సుబ్బారావు.
D2: గాదంశెట్టి మాధవి, W/o. శ్రీనివాసులు,
D3: గాదంశెట్టి అఖిల్, S/o. శ్రీనివాసులు,
D4: గాదంశెట్టి రాజేశ్వరి, D/o. శ్రీనివాసులు
పై తెలిపిన ప్రతివాదులు అందరూ D.No.5-97 మరియు D.No. 5-98, కర్నూలు రోడ్, చీమకుర్తి గ్రామ నివాసస్థులు, చీమకుర్తి మండలం.

పై నెంబరు దావాలో మీరు ప్రతివాదులు అయి ఉన్నారు. మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున పేపరు ప్రకటన ద్వారా మీకు సమన్లు జారీ చేయవలసిందిగా కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా తేది: 01/08/2025న ఉదయం 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని లేదా మీ వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరయి మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేని యెడల మీ పరోక్షమునందు విచారించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

తేది: 24/7/2025 **ఇట్లు**
ఒంగోలు

వద్దినేని రామమూర్తి
మారెళ్ళ చంద్రశేఖర్,
వాది తరపు న్యాయవాదులు,
ఒంగోలు.

इंडियन बैंक ఇండియన్ బ్యాంక్
इलाहाबाद ALLAHABAD

ఒంగోలు బ్రాంచి : 24-34-100, రామకూరివారి వీధి, సంతపేట, ఒంగోలు-523001. ప్రకాశం జిల్లా

కాంపోజిట్ హైపోథకేషన్ అగ్రిమెంట్ క్రింద బ్యాంక్‌కు సెక్యూరిటీగా తాకట్టు పెట్టిన మెషినరీ విక్రయం కోసం ఇ-వేలం అమ్మకం ప్రకటన

బ్యాంక్‌కు తాకట్టు పెట్టిన / చార్జ్ చేసిన, ఇండియన్ బ్యాంక్, ఒంగోలు బ్రాంచి యొక్క అధీకృత అధికారిచే స్వాధీనం చేసుకోబడిన దిగువ వివరించబడిన మెషినరీ ఋణగ్రహీత : **1) మెస్సర్స్ హిందూస్తాన్ సోప్స్ & సాల్ట్స్ కంపెనీ (ఋణగ్రహీత), ప్రొ॥ ఆత్మకూరి స్వప్న,** ప్లాట్ నెం. బి-11/ఎ, డోర్ నెం. 12-444, సర్వే నెం. 102, ఎపిఐఐసి ఇండస్ట్రియల్ ఎస్టేట్స్, పేర్నమిట్ట, ఒంగోలు– 523001, ప్రకాశం జిల్లా. **2) ఆత్మకూరి స్వప్న** (ప్రొప్రైట్రిక్స్) భర్త : ఎ. శ్రీధర్, నెం. 28-1-50, 1వ అంతస్తు, సౌత్ వీధి, ఏనుగు చెట్టు దగ్గర, ఒంగోలు – 523001, ప్రకాశం జిల్లా, **3) ఆత్మకూరి శ్రీధర్ (హామీదారు),** తండ్రి : ఎ. పుండరీకాక్షయ్య, నెం. 28-1-50, 1వ అంతస్తు, సౌత్ వీధి, ఏనుగు చెట్టు దగ్గర, ఒంగోలు – 523001, ప్రకాశం జిల్లా, **4) ఆత్మకూరి పుండరీకాక్షయ్య (హామీదారు),** తండ్రి : ఎ. కోటయ్య, నెం. 28-1-50, 1వ అంతస్తు, సౌత్ వీధి, ఏనుగు చెట్టు దగ్గర, ఒంగోలు – 523001, ప్రకాశం జిల్లా, **5) శ్రీమతి ఆత్మకూరి శిరీష,** భర్త : బాలాజీ, ప్రొ॥ మెస్సర్స్ సిరి ల్యాబ్స్, నెం. 28-1-50, 1వ అంతస్తు, సౌత్ వీధి, ఏనుగు చెట్టు దగ్గర, ఒంగోలు – 523001, ప్రకాశం జిల్లా, **6) శ్రీ ఆత్మకూరి బాలాజీ,** తండ్రి : పుండరీకాక్షయ్య, హామీదారు : మెస్సర్స్ సిరి ల్యాబ్స్, నెం. 28-1-50, 1వ అంతస్తు, సౌత్ వీధి, ఏనుగు చెట్టు దగ్గర, ఒంగోలు – 523001, ప్రకాశం జిల్లా, **7) శ్రీమతి ఇన్నమూరి పద్మ,** ప్రొ॥ మెస్సర్స్ పద్మ ఇండస్ట్రీస్, డి.నెం. 2/62, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఎదురుగా, మెయిన్ రోడ్, కరీడు – 523292, ఉలవపాడు మండలం, ప్రకాశం జిల్లా వారి నుండి ఇండియన్ బ్యాంక్, ఒంగోలు బ్రాంచ్ కు బకాయి ఉన్న మొత్తం **రూ. 1,85,84,940/-** (అక్షరాలా ఒక కోటి ఎనభై ఐదు లక్షల ఎనభై నాలుగు వేల తొమ్మిది వందల నలభై రూపాయలు మాత్రమే) + దానిపై తదుపరి వడ్డీ మరియు ఛార్జీలు రాబట్టుకొనేందుకు **"ఎక్కడ ఎలా ఉన్నది అలానే" "ఏది ఎలా ఉంటే అలానే" మరియు "అక్కడ ఏది ఉన్నదో అది"** ప్రాతిపదికన **కాంపోజిట్ హైపోథియేషన్ అగ్రిమెంట్ (డి 101) లోని క్లాజ్ 11(సి)** క్రింద **05-08-2025** న విక్రయించబడుతుదంని సాధారణ ప్రజలయు మరియు ముఖ్యంగా ఋణగ్రహీత (లు) మరియు హామీదారులకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

సర్వే నెం. 102, ఫ్లాట్ నెం. బి-11/ఎ, డోర్ నెం. 12-444, ఇండస్ట్రియల్ ఎస్టేట్, పేర్నమిట్ట గ్రామం, ఒంగోలు వద్ద గల మెస్సర్స్ హిందూస్థాన్ సోప్స్ అండ్ సాల్ట్స్ కంపెనీకి సంబంధించిన ఆస్తి (ఆస్తులు) షెడ్యూలు

వేలం కోసం ప్రాంగణంలో ఉన్న యంత్రాలు

నెం.	ఋణగ్రహీత పేరు	హైపోథికేటెడ్ కాబడిన ఆస్తుల వివరాలు	
1	మెస్సర్స్ హిందూస్తాన్ సోప్స్ & సాల్ట్స్ కంపెనీ ప్రొ॥ ఆత్మకూరి స్వప్న,	Set consist of 500 Kg Mixing Machine 8:" Vaccum Pledder Machine Cage Miller 350*700mm	1
2		Dish wash single warm Duplex 6" plodder machine fabrication screw bamal with complete set	1
3		Automatic preumatic soap cutting machine fabrication	1
4		Soap wrapping machine with complete fabrication with motor	1
5		Heavy duty Sigma Mixture machine 250kg/hrs Complete fabrication, Gear Box	1
6		Lift Platform and other materials inside including machinery connected electrical wiring.	

రిజర్వ్‌ధర : రూ. 9,00,000/- + తుది బిడ్ అమ్మకపు ధరపై జి.ఎస్.టి. వర్తిస్తుంది.
బయానా మొత్తం : రూ. 90,000/-, బిడ్ పెంపుదల : రూ. 10,000/-
ఇ-వేలం తేది మరియు సమయం : 05-08-2025న ఉ॥ 11.00 గం.కు
(అమ్మకం ముగిసేవరకు ప్రతిసారి 5 నిమిషాల కాలవ్యవధి గల అపరిమిత పొడిగింపుతో)

రిజర్వ్ ధరలో 10% బయానా మొత్తాన్ని డిడి / ఐపిఓ రూపంలో ది. 04-08-2025న లేదా ఆలోగా డిపాజిట్ చేయాలి.

ఇ-వేలం ప్రక్రియ కొరకు సంప్రదించండి సర్వీస్ ప్రొవైడర్ : **M/s. C1** ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, వెబ్ పోర్టల్ : **"https://www.bankeauctions.com"**, శ్రీ పి. ధరణి కృష్ణ, సెల్ నెం. **9948182222**, అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు చీఫ్ మేనేజర్, ఇండియన్ బ్యాంక్, ఒంగోలు బ్రాంచ్, సెల్ నెం. **9535009491** వారిని ఏదైన పనిరోజున కార్యాలయ వేళలలో సంప్రదించండి.

గమనిక : **1)** వేలం / బిడ్‌లో పాల్గొనే కొనుగోలు దార్లు అందరూ అతని / ఆమె / వారి అంగీకారయోగ్యమైన ... డాక్యుమెంట్లను దాఖలు చేయాలి. **2)** అమ్మకం బ్యాంక్ నిర్ధారణకు లోబడి ఉంటుంది. **3)** అమ్మకం **"ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా" "అక్కడ ఉన్నవి ఉన్నట్లు" మరియు "అక్కడ ఏమున్నవో అవి"** ప్రాతిపదికన జరుగుతుంది. **4)** బ్యాంక్‌కు లభించే ఏ ఇతర పరిష్కారానికి ప్రతికూలాభిప్రాయం లేకుండా ఈ నోటీసు ఉంటుంది. **5)** ఆస్తి యొక్క గెలుపొందిన కొనుగోలు దారు వర్తించే రాష్ట్ర / కేంద్ర / సాధనిక చట్టాల ప్రకారం అతని పేరున రిజిస్ట్రేషన్ యొక్క బదలీ కొరకు చెల్లించవలసిన అన్ని ఛార్జీలు /ఖర్చులు / ఫీజులు / పన్నులు భరించాలి.

తేది : 22-07-2025
ప్రదేశం : ఒంగోలు

సం/- అధీకృత అధికారి & చీఫ్ మేనేజర్
ఇండియన్ బ్యాంక్, ఒంగోలు బ్రాంచి

బెట్టింగ్ యాప్ నిర్వాహకులు అరెస్టు

బ్యాంకు ఖాతాలు సేకరించి విదేశాలకు తరలింపు

ఏటీఎం కార్డులు, బ్యాంక్ పాస్ పుస్తకాలు స్వాధీనం

కేసు చేధించిన పోలీసులకు ఎస్పీ అభినందనలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను నిర్వహిస్తూ, అమాయక ప్రజల బ్యాంక్ ఖాతా వివరాలను ఇతర దేశాలకు పంపుతున్న ముఠాను ప్రకాశం జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. నిందితులను నుంచి పలు ఏటీఎం కార్డులు, బ్యాంక్ పాస్ పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. కేసును చేధించడంలో ప్రతిభ కనబర్చిన పోలీస్ అధికారులు, సిబ్బందినీ జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ అభినందించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం జరిగిన ప్రెస్ మీట్లో వివరాలను జిల్లా ఎస్పీ వెల్లడించారు. సంతనూతలపాడు మండలం పేర్లమాన్యానికి చెందిన షేక్ జై బూన్ ఫిర్యాదు మేరకు ఒంగోలు తాలూకా పోలీస్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఈ కేసులో ఉదయగిరికి చెందిన షేక్ యాసిన్ (ప్రస్తుతం హైదరాబాద్) అనే వ్యక్తికి విదేశాల్లో ఉంటూ ఆన్లైన్ బెట్టింగ్ యాప్స్ నిర్వహిస్తున్న వైట్, జిమ్మీ, మౌనిక మరి కొంతమందితో టెలిగ్రాంలో పరిచయాలు ఏర్పడ్డాయి. ఇండియాలో కూడా ఈ ఆన్‌లైన్ బ్యాటింగ్ యాప్‌లలో ఎక్కువ మంది గేమ్స్ ఆడుతున్నారని, ఇందుకు సంబంధించి మనీ ట్రాన్స్‌ఫర్లకు అనేక బ్యాంకు ఖాతాలు అవసరం ఉండటంతో టెలిగ్రామ్ యాప్ ద్వారా నెల్లూరుకు చెందిన శ్యామ్ హైదరాబాదులో ఉన్న ప్రణీత్ మరి కొంతమందిని యాప్‌లో యాడ్ చేసుకున్నారు. ఎవరైనా సేవింగ్ అకౌంట్ తమకు ఇస్తే సేవింగ్ అకౌంట్‌కి రూ.25 వేలు, కరెంట్ అకౌంట్ ఓపెన్ చేసి వాటి తాలూకా సిమ్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి ఏఆర్ దామోదర్

కార్డ్ డెబిట్ కార్డు, బ్యాంకు బుక్కు వాళ్లకు ఇస్తే రూ.45 వేలు ఇస్తామని నమ్మబలికారు. టెలిగ్రామ్ గ్రూపులో చెప్పగా, ఆకర్షితులై ప్రణీత్ తన ఫ్రెండ్ ఒంగోలుకు చెందిన నాయబ్ రసూల్‌కు ఈ విషయం చెప్పాడు. నాయబ్ రసూల్ తన తల్లి మస్తానమ్మ, పీర్లమన్యంలో ఆయాగా పనిచేస్తున్న ఆయేషా మరికొందరితో కర్ణాటక బ్యాంక్, ఐఒబి, ఫెడరల్ బ్యాంక్‌లలో సేవింగ్, కరెంట్ అకౌంట్‌లు తెరచి ఒక్కొక్క సేవింగ్ అకౌంట్‌కు రూ.6 వేలు, కరెంట్ అకౌంట్‌కి రూ.10 వేలు చొప్పున వారికి ఇచ్చి సిమ్ కార్డ్, ఏటీఎం, బ్యాంకు బుక్‌లను తీసుకున్నారు. తర్వాత వాటి అన్నింటిని నాయబ్ రసూల్ హైదరాబాదులో ఉంటున్న ప్రణీత్‌కు కొరియర్ చేయగా వాటిని అజయ్, విజయ్‌లు ప్రణీత్‌కు అందజేశారు. ఇందుకు నాయబ్ రసూల్‌కు ఒక సేవింగ్ అకౌంట్‌కు రూ.15 వేలు, కరెంట్ అకౌంట్‌కు రూ.25 వేలు చొప్పున ఇచ్చాడు. తర్వాత ప్రణీత్ ఆ అకౌంట్ల కిట్లును ఉదయగిరికి చెందిన షేక్ యాసిన్, నెల్లూరుకి చెందిన శ్యామ్ ఆదేశాల మేరకు నెల్లూరులో ఉంటున్న చైతన్యకు కొరియర్ చేశాడు. అందుకు గాను షేక్ యాసిన్, శ్యాంలు ప్రణీత్‌కు ఒక సేవింగ్ అకౌంట్‌కు రూ.25 వేలు, కరెంట్ అకౌంట్‌కు


పోలీసులు స్వాధీనం చేసుకున్న ఫోన్లు, బ్యాంకు పుస్తకాలు

రూ.45 వేలు చొప్పున ఇచ్చేవారన్నారు.

నెల్లూరుకు వెళ్లిన ఈ కిట్లను చైతన్య రిసీవ్ చేసుకొని వాటిని ఉదయగిరికి చెందిన రబ్బు, షహిజాద్ అలీకు పంపేవాడు. అందుకు చైతన్యకు షేక్ యాసిన్ నెలకు రూ.15 వేలు ఇచ్చేవారు. ఈ సిమ్ కార్డులు తీసుకొన్న రబ్బు మరియు షహిజాద్ అలీ టెలిగ్రామ్ యాప్‌లో శ్యామ్, జిమ్మీ, వైట్, షేక్ యాసిన్ ఆదేశాల మేరకు ఉదయగిరిలో నెట్ బ్యాంకింగ్ యాక్టివేట్ చేసి వాటి స్క్రీన్ షాట్‌లను మరలా అదే టెలిగ్రామ్ గ్రూపులో పోస్ట్ చేసేవాడు. ఈ కేసులో 27 అకౌంట్‌లు గుర్తించి ఫ్రీజ్ చేసినట్లు జిల్లా ఎస్పీ తెలియజేశారు. ప్రజలు తమ బ్యాంకు ఖాతా వివరాలను ఎవ్వరికీ ఇవ్వకూడడని, ఆధార్ కార్డు, పాన్‌కార్డు, ఓటీపీ నెంబర్ చెప్పకూడదన్నారు. అనవసరమైన లింక్స్ క్లిక్ చేయకూడదని, అలా చేస్తే సైబర్ నేరాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఈ కేసులో అజయ్, విజయ్ శ్యామ్, రబ్బు, విజయ్, జిమ్మీ, వైట్, మౌనికా, షేక్ యాసిన్‌లను త్వరలో పట్టుకొంటామన్నారు. ఈ కేసును చేదించడంలో కృషి చేసిన ఒంగోలు డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, ఒంగోలు తాలుకా సిఐ విజయ కృష్ణ, ఐటి కోర్ సిఐ వి.సూర్యనారాయణ, ఒంగోలు తాలుకా ఎస్.ఐ బి.ఫణి భూషణ్, ఐటి కోర్ ఆర్.ఎస్.ఐ. భరత్ మరియు వారి సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

ఆక్రమించెయ్.. అద్దెకిచ్చెయ్..!

- సైడు కాలువలపై బంకులు ఏర్పాటు
- అద్దెకిచ్చి జేబులు నింపుకుంటున్న అధికార పార్టీ నాయకుడు
- చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి-పామూరు

పామూరు పట్టణంలోని ప్రధాన రహదారుల పక్కన సైడు కాలువలు ఆక్రమణకు గురవుతున్నాయి. కాలువలపై బంకులు ఏర్పాటు చేసి వ్యాపారులకు అద్దెలకిచ్చి జేబులు నింపుకుంటున్నారు. ఇటీవల రోడ్డు విస్తరణకు పలు రోడ్లలో ఆక్రమణలు తొలగించిన అధికారులు అధికార పార్టీ నాయకుల ఆధ్వర్యంలోని బంకుల జోలికి వెళ్లికపోవడం పట్టణంలో చర్చనీయాంశమైంది. అధికారుల తీరును ప్రజలు విమర్శిస్తున్నారు.

ఇటీవల ఆర్ఎంబి, పంచాయతీ అధికారులు సైడు కాలువపై ఉన్న షాపులను తొలగించారు. పట్టణంలోని నెల్లూరు రోడ్డు నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు, సిఎస్ పురం, బస్టాండ్ నుంచి కందుకూరు బస్టాండ్ వరకు సైడ్ కాలువలుపై ఉన్న ఆక్రమనలు తొలగించి రోడ్డు వెడల్పు చేపట్టారు. రోడ్డు వెడల్పుగా ఉండటంతో రవాణా సమస్య పరిష్కారం అవుతుందని మండల పట్టణ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. రోడ్డు వెడల్పు చేయడం సరే పూర్తి చేయుటకు నిధులు ఉన్నాయో లేదో అనే చర్చ పట్టణంలో


బంకు పెట్టేందుకు కాలువపై వేసిన రాళ్లు


కందుకూరు రోడ్డులో బాడుగలకు ఇచ్చిన బంకులు

జరుగుతుంది. అధికార పార్టీ నాయకుడు కందుకూరు రోడ్డు పక్కనే ఆక్రమించుకొని ఒక్కొక్క షాపుకు ఎనిమిది వేల నుంచి పదివేల వరకు బాడుగులకు ఇచ్చి జేబులు నింపుకుంటున్నారు. వాటిని తొలగించక పోవడం పట్టణంలో ప్రజలు చర్చించుకుంటున్నారు. ఆక్రమణలు నాయకులకు ఒక రకం, పేదలకు ఒక రకం ఉన్నాదని పలువురు చర్చించుకుంటున్నారు. ఆర్టీసీ బస్టాండ్ దగ్గర సైడ్ కాలువ మీద నాపరాళ్ళు వేసి బంకులు పెట్టేందుకు సిద్ధం చేస్తున్నారు. సంబంధించి అధికారులు సైడ్ కాలువలపై బంకుల నిర్మిస్తే వెంటనే తొలగించి ప్రయాణికులకు వినియోగదారులకు ఇబ్బంది లేకుండా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

దళితులకు విద్యను దూరం చేసే చర్యలు ఆపాలి

పాఠశాలల విలీనంపై ఎస్సీ, ఎస్టీ చైర్మన్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

దళితులకు విద్యను దూరం చేసే చర్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ కొత్తపల్లి శామ్యూల్ జవహర్‌ను, విద్యాశాఖ కమిషనరును కలిసి సమస్యల విన్నపించినట్లు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు తెలిపారు. హనుమంతునిపాడు మండలంలో 15 పాఠశాలలో తరగతుల విలీనంలో భాగంగా 12 దళితవాడల్లో పాఠశాలలు విలీనం జరిగాయని ఇందులో ఎనిమిది పాఠశాలలు కనీస నిబంధనలు పాటించకుండా విలీనం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి మంగంపల్లి


ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న మంగంపల్లి గ్రామస్థులు

విద్యా కమిటీ చైర్మన్ భర్త కమలాకర్, నందా గరటయ్య తదితరులు కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ ప్రభుత్వ నియమ నిబంధనలు స్థానిక మండల విద్యాశాఖ అధికారి తుంగలో తొక్కారని ఆరోపించారు. నాలుగు కిలోమీటర్ల నుంచి రెండు కిలోమీటర్ల వరకు దూరంలో ఉన్న పాఠశాలలను మార్గ మధ్యలో వాగులు, స్మశానాలు ప్రమాదకరమైనటువంటి అడవి జంతువులు తిరిగేటువంటి చెరువు కట్టలు, కోతులు, విష సర్పాలు సంచరించే బాటలో నడవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఏ ఒక్క గ్రామంలో కూడా విద్యా కమిటీ ఆమోదం లేదన్నారు. ఎక్కువమంది దళిత విద్యార్థులు ఉన్నప్పటికీ ఈ విషయంలో కులవ్యవక్షతను అంటరానితనాన్ని ఎంఈఓ ప్రత్యక్షంగా చూపించారని వీరు ఆరోపించారు. వెంటనే విద్యాశాఖ కమిషన్, ఎస్సీ, ఎస్టీ కమిషనర్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ కమిషనర్ చైర్మన్ మాట్లాడుతూ 15 రోజుల్లో మీకు పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న ఆటో.. వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-దొనకొండ


గాయపడిన సుబ్బయ్య

ద్విచక్రవాహనాన్ని ఆటో ఎదురుగా ఢీకొట్టడంతో వ్యక్తి తీవ్ర గాయాలపాలైన సంఘటన దొనకొండ-మార్యాపురం ప్రధాన రహదారిలోని కెజీబీవీ పాఠశాల మలుపు వద్ద బుధవారం సాయంత్రం జరిగింది. అందిన వివరాల మేరకు.. ఇండ్లచెరువు గ్రామానికి చెందిన బోయపాటి సుబ్బయ్య దొనకొండలో ఆటోమొబైల్స్ షాపు నిర్వహిస్తున్నాడు. బుధవారం సాయంత్రం ఇండ్లచెరువు నుంచి తన బైక్‌పై దొనకొండకు వస్తుండగా కెజీబీవీ మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో సుబ్బయ్య కుడి కాలు, కుడి చేయి విరిగాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటన ప్రదేశానికి చేరుకొని బాధితుడికి ప్రథమ చికిత్స చేసి స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం అక్కడ నుంచి నరసరావుపేట వైద్యశాలకు తరలించారు.

ఈ రహదారిపై కెజీబీవీ పాఠశాల మలుపు వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతూ అనేకమంది తీవ్ర గాయాలపాలవుతున్నా సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. అధికారులు స్పందించి రహదారిపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుతో పాటు దట్టంగా పెరిగిన చిల్లచెట్లు తొలగించేలా చర్యలు చేపట్టి రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

బెతూన్ నర్సింగ్ హోంలో అగ్నిప్రమాదం

షార్ట్ సర్క్యూట్‌తో ఆపరేషన్ థియేటర్‌లో మంటలు

భారీ నష్టం.. రోగులను కాపాడిన సిబ్బంది

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

మంగమూరు రోడ్డులోని ప్రముఖ వైద్యశాల బెతూన్ నర్సింగ్ హోం నూతన భవనంలో బుధవారం మధ్యాహ్నం షాట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. ఆపరేషన్ థియేటర్‌లో మంటలు, పొగ వ్యాపించాయి. వెంటనే అప్రమత్తమైన ఆసుపత్రి వైద్యులు డాక్టర్ పురుషోత్తమరావు, సందీప్ సిబ్బంది సాయంతో రోగులకు బయటకు పంపించారు. ఎవరి ప్రాణాలకూ ముప్పు లేకుండా చూశారు. సిబ్బంది మొత్తం వెంటనే రోగులను జాగత్తగా రూములనుంచి బయటకు తీసుకువచ్చారు. సురక్షి ప్రాంతంలో ఉంచారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన వచ్చి ఆపరేషన్ థియేటర్‌లో మంటలను ఆర్పారు. కరెంటు తీగలు కాలిపోవడంతో దట్టమైన పొగ వ్యాపించింది. సుమారు గంటకుపైగా బ్లోయర్లు పెట్టి పొగను బయటకు పంపారు. విద్యుత్‌శాఖ అధికారులు వచ్చి ఏం జరిగిందో పరిశీలించారు. ట్రాన్స్‌పార్మర్ నుంచి వచ్చే సప్లయిలో ఏమైనా లోపం ఉందా? అనేకోణంలో పరిశీలించారు. ఈప్రమాదంలో ఆపరేషన్ థియేటర్‌లోని ఆధునిక పరికరాలు దెబ్బతిన్నాయి. భారీగానే నష్టం ఉంటుందని ఆసుపత్రి ప్రధానవైద్యులు డాక్టర్ పురుషోత్తమరావు వెల్లడించారు. రోగులకు ఎలాంటి ప్రాణనష్టం లేకుండా చేయగలిగామని ఆయన తెలిపారు.

ఏటీఎంకు దారేదీ..?

ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు

ప్రజాశక్తి-శింగరాయకొండ



ఏటీఎం ముందు ఉన్న మురుగు

శింగరాయకొండ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకు వద్ద ఉన్న ఏటీఎంకు దారి లేక ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకు అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో బ్యాంకు వద్దకు వెళ్లిన ఖాతాదారులు ఏటీఎంకి వెళ్లి డబ్బులు తీసుకోవాలంటే అక్కడ ఉన్న మురుగు కాలువ దాటి వెళ్లలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. కాలువ మీద కనీసం బండలు వేయించలేక పోవడం వలనే ఈ పరిస్థితి వచ్చింది. నిత్యం వందలాదిమంది బ్యాంకుకు వచ్చే ఖాతాదారులతో పాటు ఏటీఎంకి వెళ్లే ఖాతాదారులు అక్కడ ఉన్న కాలువ మీద బండలు లేక ఆ మురుగు కాలవ దెబ్బకు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఉన్నతాధికారులైన జోక్యం చేసుకొని ఏటీఎంకు వెళ్లేందుకు దారి చూపించాలని వేడుకుంటున్నారు.

విద్యుత్‌పై మాట తప్పిన కూటమి ప్రభుత్వం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి రమాదేవి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు

స్మార్ట్ మీటర్ల వ్యతిరేక ప్రచార కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - బాపట్ల

ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం విద్యుత్ విషయంలో మాట తప్పిందని సిపిఎం రాష్ట్ర నాయకులు సిహెచ్ బాబురావు ఆరోపించారు. పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య ప్రజాసంఘాల జిల్లా కార్యాలయంలో 'మా ఇంటికి స్మార్ట్ మీటర్లు వద్దు, విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి' అనే కరపత్రాలు సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి రమాదేవితో కలిసి బుధవారం ఆవిష్కరించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి అధికారానికి వచ్చిన తర్వాత నమ్మక ద్రోహం చేసిందని ఆరోపించారు. ఎన్నికల మేనిఫెస్టోలో విద్యుత్ ఛార్జీలు తాము పెంచబోమని, తగ్గిస్తామని నారా లోకేష్ ప్రజలకు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. వైసిపి పాలనలో బిగిస్తున్న స్మార్ట్ మీటర్లను లోకేష్ పగులగొట్టిన సందర్భాలు గుర్తు చేశారు. పాలక ప్రభుత్వం పూర్తిగా రివర్స్ గేర్‌లో పని చేస్తుందని అన్నారు. ఈ ప్రభుత్వం ఇందులో కూడా ప్రజలు మోసం చేశారని, ఏడాది కాలంలో ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో రూ.15,485 కోట్లు అదనంగా ప్రజల మీద కూటమి ప్రభుత్వం భారం మోపిందని అన్నారు. గత 36 నెలల నుండి వైసిపి ప్రభుత్వంలో వేసిన రూ.3వేల కోట్ల సర్దుబాటు చార్జీని ఈ ప్రభుత్వం కూడా కొనసాగిస్తోందని అన్నారు. చిన్న పరిశ్రమలు, గృహ వినియోగదారులు అందరికీ విద్యుత్ సుంకం కరెంటు బిల్లు మీద పన్ను యూనిట్‌కు ఆరుపైసలు ఉండేదని, దాన్ని వైసిపి ప్రభుత్వం 100 పైసలకు పెంచిందని అన్నారు. దాన్ని ఈరోజు చట్ట సవరణ చేసి ఈ ప్రభుత్వం చట్టబద్ధత కల్పించడం ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. ముందు ఆఫీసులకే అని, ఆ తర్వాత వ్యాపార సంస్థలకే పరిమితం అని వైసిపి బాటలోనే కూటమి ప్రభుత్వం విద్యుత్ విషయంలో నడుస్తోందని అన్నారు. రూ.175 కోట్లు ఇందులో అవినీతి జరిగిందని అమెరికా కోర్టులో సాక్షాదారాలతో విచారణ జరుగుతుందని అన్నారు. బిజెపి జగన్ బినామీ సంస్థగా టిడిపి నేతలు చెప్పిన ఆ షిరిడి సాయి ఎలక్ట్రికల్స్ అన్ని రకాల కాంట్రాక్టులు కొనసాగిస్తున్నారని అన్నారు. వైసిపి ప్రభుత్వంలో హైకోర్టులో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కేసు వేశారని, అయితే ఇప్పుడు ఈ ప్రభుత్వం చేస్తున్నది ఏమిటని ప్రశ్నించారు. ఆగస్టు 5నుండి ప్రజా వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్తు కార్యాలయం దగ్గర నిరసనలు, ధర్నాలకు పిలిపు ఇచ్చినట్లు తెలిపారు. ప్రజలందరూ ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. తొలుత కేరళ మాజీ సిఎం అచ్యుతానందన్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. సమావేశంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి రమాదేవి, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆంధ్ర మాల్యాద్రి, సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య, టి కృష్ణమోహన్, సిహెచ్ మజుందార్, కె శరత్ పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యలపై నిరంతర పోరాటం



మాట్లాడుతున్న మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - నిజాంపట్నం

మత్స్యకారుల సమస్యలు అధ్యయనం, కొత్తపాలెం జెట్టి వద్ద విద్యుత్ కోసం త్రీ పేస్ లైన్ ఏర్పాటు చేయాలని, చీరాల ఓడరేవు, ఈపురు పాలెం సిమౌత్ ఆక్రమణ సమస్యపై జిల్లాలో మత్స్యకారులు ఐక్యంగా కలిసి రావాలని ఎపి మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి శ్రీనివాసురావు పేర్కొన్నారు. మండలంంలోని కొత్తపాలెం, నిజాంపట్నం గ్రామాల్లో మత్స్యకారులును కలిసి సమస్యలు అధ్యయనం చేసిన సందర్భంగా కొత్తపాలెంలో ఆయన మాట్లాడారు. కొత్తపాలెం చేపల వేటాడే బోట్లను నిలుపుదల చేసుకోవడానికి రేవును స్వయంకృషితో రూ.లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేసుకున్నారని అన్నారు. బోట్లు రిపేర్ చేసుకోవడానికి విద్యుత్తు త్రీఫేస్ లైను ప్రభుత్వ ఏర్పాటు చేయాల్సి ఉన్నదని, వేటనిషేధ భృతి గ్రామంలో 60మందికి ఇవ్వాల్సి ఉందని అన్నారు. ఫీషరిస్ అధికారులు స్పందించడం లేదని, ఆరు బోట్లు సిలిండర్లు, ఇంజన్‌లు బిగించుకుని వేట చేస్తున్న వారికి 100 లీటర్లు మాత్రమే డీజిల్ ఇస్తున్నారని, తక్షణమే బోటు కొలతలు, ఇంజన్లు పరిశీలించి మెకానైజెడ్ బొట్లుగా రిజిస్ట్రేషన్ చేసి ఫిషరీస్ అధికారులు సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. జిల్లా సముద్ర తీర ప్రాంతంలో ఎపి టూరిజం పేరుతో విస్తరిస్తున్నందున రియల్ ఎస్టేట్ వ్యాపారం రూ.వేలకోటలో జరుగుతున్నాయని అన్నారు. మత్స్యకారులు సముద్రం తీరం నుండి నెట్టివేసే ప్రక్రియ కొనసాగుతుందని అన్నారు. అందులో భాగంగా చీరాల, వాడరేవు సరిహద్దులోని ఈపురుపాలెం స్ట్రెయిట్ కట్ ఒక కిలో మీటర్ మేర ఎల్ అకారంలో ఉన్న సీ మౌత్ ఒక పథకం ప్రకారం పూడ్చివేసాడని అన్నారు. సాహజ సిధంగా ఏర్పడిన ఇసుక తిన్నేలను అమ్ముకున్నారని ఆరోపించారు. మత్స్యకారులను శ్రీ భ్రమర సారథ్యంలో బుర్ల వెంకట్రావు, మామిడయ్య మోసం చేశాడని, ఈ సమస్యపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసి ప్రభుత్వ అధికారులపై మత్స్యకారులు తిరగబడి న్యాయం చేయాలని కోరగా ఇంతవరకు సిఆర్జెడ్ ఆక్రమించిన శ్రీ భ్రమరా, బుర్ల వెంకటరావుపై చర్యలు తీసుకోకపోగా అధికారులే ధనవంతుల కాసులకు కక్కుర్తి పడి మత్స్యకారులకు అన్యాయం చేయాలని చూస్తున్నారని అన్నారు. న్యాయం జరిగే వరకూ ఎపి మత్స్యకారులు మత్స్యకార్మిక సంఘం నిరంతరం పోరాడుతుందని అన్నారు. 25న స్థానిక ఎన్జీఓ హోంలో జరిగే రౌండ్ టేబుల్ సమావేశంకు హాజరు కావాలని కోరారు. మత్స్యకారుల సమస్యలు అధ్యయనంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్, ఇతర మత్స్యకారులు, గంగపుత్ర బోట్ ముఠా వర్కర్స్ సిహెచ్ శ్రీనివాసరావు, వెంకట రమణరావు, పి ప్రసాద్, చెన్ను ప్రహ్లాదుడు పాల్గొన్నారు.

కెప్టెన్ లక్ష్మిసెహగల్ స్ఫూర్తితో మహిళా ఉదమాలు



నివాళులర్పిస్తున్న మహిళలు

ప్రజాశక్తి - ముండ్లమూరు

దేశ స్వాతంత్ర పోరాటంలో సుభాష్ చంద్రబోస్ నిర్మించిన ఆజాద్ హింద్ ఫౌజ్ మహిళా రెజిమెంట్ కెప్టెన్‌గా పనిచేసిన ధీరవనిత కెప్టెన్ లక్ష్మి సెహెగెల్ అని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి అన్నారు. మండలంలోని మారెళ్ళలో వెల్లంపల్లి మల్లేశ్వరి అధ్యక్షతన లక్ష్మీ సహగల్ వర్ధంతి బుధవారం నిర్వహించారు. లక్ష్మి సెహెగెల్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ లక్ష్మీ సహగల్ తండ్రి మద్రాసులో ప్రముఖ న్యాయవాదని, తల్లి సామాజిక సేవా కార్యకర్తని తెలిపారు. వారి స్ఫూర్తితో చిన్నతనంలోనే సెహగల్ విదేశీ వస్తు బహిష్కరణ, మధ్యనిషేధం వంటి ఉధ్యమాలతోపాటు జాతీయోద్యమంలో వీరోచితంగా పాల్గొన్నారని అన్నారు. 1938లో మద్రాసులో వైద్య విద్య పూర్తయిన తరువాత 1940లో సింగపూర్ వెళ్ళి అక్కడ భారతీయ నిరుపేదలవాడలో వైద్యశాల స్థాపించి సేవలందించారని అన్నారు. అక్కడే నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రసంగాలకు ప్రభావితురాలై స్వాతంత్ర్యోద్యమంలో 'ఆజాద్ హింద్ ఫౌజ్' మహిళా దళాల్లో చేరి కెప్టెన్ హెూదా పొందారని అన్నారు. లక్ష్మీ సెహగల్ 1947లో లాహెూర్‌కు చెందిన కర్నల్ ప్రేమ్ కుమార్ సెహగల్‌ను వివాహం చేసుకొని కాన్పూర్‌లో స్థిరపడి ప్రజలకు వైద్య సేవలు అందించారని తెలిపారు. స్వాతంత్ర్యానంతరం ఐద్వా ఉపాధ్యక్షురాలిగా వివిధ స్థాయిల్లో పని చేశారని తెలిపారు. 1971లో సిపిఎం తరఫున లక్ష్మీ సెహ్‌గల్ రాజ్యసభ సభ్యురాలిగా ఎన్నికయ్యారని, 2002లో జరిగిన రాష్ట్రపతి ఎన్నికల్లో వామపక్షాల మద్దతుతో బరిలోకి దిగారని తెలిపారు. 2012 జూలై 23న కాన్పూర్‌లో వయోభారంతో మరణించారని అన్నారు. ఆమె త్యాగం, ధైర్యం, సేవ, దేశభక్తి నేటి తరానికి ఆదర్శం కావాలని అన్నారు. కార్యక్రమంలో కె శ్రీదేవి, టీ కాశమ్మ, జి నారాయణ, చంద్రమ్మ, యు సంధ్యా, యు రామాంజమ్మ పాల్గొన్నారు.



ఆజాద్ విగ్రహం నివాళులర్పిస్తున్న నాయకులు

ఆంగ్లేయులకు సింహస్వప్నం ఆజాద్

ప్రజాశక్తి - బాపట్ల

బ్రిటిష్ వారికి సింహ స్వప్నంగా మారిన చంద్రశేఖర్ ఆజాద్ భారత స్వాతంత్ర్య పోరాటంలో తొలి సాయిధ పోరాట యోధుడని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి పిసి సాయిబాబా అన్నారు. చంద్రశేఖర్ ఆజాద్ 119వ జయంతి సందర్భంగా ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో మండల కార్యాలయం వద్ద గల ఆజాద్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ లాలా లజపతిరాయ్ మృతికి కారణమైన ఆంగ్లేయ అధికారులపై ప్రతీకారం తీర్చుకొని, భారతీయుల సత్తా చాటారని అన్నారు. ఆయన రుణం భారత జాతి ఎన్నటికీ తీర్చుకోలేనిదని అన్నారు. ఆంగ్లేయుల చేతికి చిక్క కూడదనే ఆలోచనతో చివరకు బ్రిటిష్ పోలీసులు చుట్టుముట్టగా తనను తాను పిస్తోలుతో కాల్చుకొని ఆజాద్ అమరుడయ్యాడని అన్నారు. నేటి యువత ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని దేశాభివృద్ధికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు జమృద్ భాష, భాస్కరరావు, ఆనంద్, షేక్ బాజీ, చంద్రబాబు, రామక్రిష్ణ పాల్గొన్నారు.



చిన్నారులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

ప్రతి ఇంటికీ సంక్షేమం అందిస్తాం

ప్రజాశక్తి - చీరాల

ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని శాసన సభ్యులు ఎంఎం కొండయ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహిస్తుందని అన్నారు. ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా 31వ వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు, వైస్ చైర్మన్ పొత్తూరి సుబ్బయ్య, 31వ వార్డు కౌన్సిలర్ సత్యానందంతో కలిసి ఆయన వార్డులో పర్యటించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ కౌతరపు జనార్ధన్, టిడిపి మండల అధ్యక్షులు గంజి పురుషోత్తం, పిఎసిఎస్ చైర్మన్ కోటి మోహన్ కృష్ణ పాల్గొన్నారు.

మంత్రి కేశవ్ పర్యటన

ప్రజాశక్తి - పర్చూరు, మార్టూరు రూరల్

రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌తో కలసి శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు ఈనెల 25న శుక్రవారం పర్చూరు మండలంలో పర్యటించనున్నట్లు ఎంఎల్ఎ కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. పర్చూరు వై జంక్షన్లోని ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద ప్రత్యేక పూజల అనంతరం స్థానిక బొమ్మల సెంటర్లో తెలుగుదేశం వ్యవస్థాపకులు ఎన్‌టిఆర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పిస్తారని అన్నారు. అనంతరం బొమ్మల సెంటర్ నుంచి 'సుపరిపాల నలో తొలి అడుగు' ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం ప్రారంభిస్తారని తెలిపారు. స్థానిక నెహ్రూ కాలనీలో రూ.80 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లను ప్రారంభిస్తారు. మద్యాహ్నం నాగుల పాలెంలో ఇంటింటికి తెలుగుదేశంలో పాల్గొని రూ. 55 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లు, డ్రైన్లను ప్రారంభిస్తారని తెలిపారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ ఆవరణలో సిఎం సహాయ నిధి ద్వారా 145 మందికి రూ.83,85,313 విలువైన చెక్కులను, రూ.4కోట్ల శ్రీనిధి బ్యాంక్ లింకేజీ రుణాలు అందజేస్తారు. అనంతరం స్థానిక మార్కెట్ యార్డులో పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సందర్శిస్తారని తెలిపారు. పొగాకు రైతులతో ముచ్చటిస్తారని తెలిపారు.



సన్మానం పొందుతున్న సచివాలయ సిబ్బంది

సచివాలయ సిబ్బందికి సన్మానం

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని ఆడుసుమల్లి సచివాలయంలో పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న డిజిటల్, ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అసిస్టెంట్లను, సచివాలయ సిబ్బందిని బుధవారం ఘనంగా సత్కరించారు. ఆడుసుమల్లి, బోడవాడ సర్పంచులు, కార్యదర్శులు పాల్గొని సచివాల సిబ్బందిని దుశ్యాలవాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఇఒ లక్ష్మీనరసయ్య మాట్లాడారు. సచివాలయ సిబ్బంది సేవలను కొనియాడారు. సచివాలయ వ్యవస్థ ప్రారంభం నుంచి మంచి సేవలు అందించారని, ప్రజల్లో వీరి పనితీరు పట్ల మంచి గుర్తింపు తెచ్చుకున్నారని అన్నారు. డిజిటల్ అసిస్టెంట్ అల్లాడి జయకుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వెంకటేష్, అగ్రికల్చర్ అసిస్టెంట్ డి ఆదిలక్ష్మి, వెల్ఫేర్ అసిస్టెంట్ ఎలవర్తి శిరీషను సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచులు చెన్నుపాటి లక్ష్మీ, కూనమనేని బాపూజీ, ఉప సర్పంచులు అడ్డగడ వెంకటేశ్వర్లు, కన్నెగంటిసాంబశివరావు, కార్యదర్శులు కె లక్ష్మీనరసయ్య, పి వెంకటేశ్వరరావు, నరిశెట్టి వెంకటసు సుబ్బారావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జాతీయ సమైక్యతా ర్యాలీ

- 3600 అడుగుల త్రివర్ణ పతాకంతో ప్రదర్శన
- పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్ల



3600 అడుగుల జాతీయ జెండాతో నిర్వహిస్తున్న ర్యాలీ

ప్రజాశక్తి- ఒంగోలు కలెక్టరేట్

జాతీయ భావన, సమైక్యత పెంపొందించేలా వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో త్రివర్ణ పతాకంతో ర్యాలీ నిర్వహించడం అభినందనీయమని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు పేర్కొన్నారు. వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎరుకుల్లా రామకష్ణ వైస్ ప్రెసిడెంట్ శిద్ధా వెంకట సూర్య ప్రకాష్ రావు, సభ్యుల ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ పతాక ప్రదర్శన బుధవారం నిర్వహించారు. అనంతరం పోలీస్ గ్రౌండ్ వద్ద నుంచి అద్దంకి బస్టాండ్ వరకూ 3600 అడుగుల పొడవైన జాతీయ జెండాతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతీయ పతాకాన్ని తెలుగు వ్యక్తి పింగళి వెంకయ్య రూపొందించడం గర్వకారణమన్నారు. ఆంధ్ర ప్రాంతానికి చెందిన మహోన్నత వ్యక్తికి ఇలాంటి గొప్ప ఘనత దక్కిందన్నారు. త్రివర్ణ పతాకాన్ని చూస్తేనే సహజంగానే దేశభక్తి, గర్వం ఉరకలేస్తాయన్నారు. మన గ్రామం, మండలం, జిల్లా, రాష్ట్రం, దేశం, తల్లిదండ్రులు ఎలాగో త్రివర్ణ పతాకం కూడా మంచి స్ఫూర్తి కలుగుతుందన్నారు. శాంతి, సహనం, అహింస అనే తత్వాన్ని జాతీయ జెండా చాటి చెబుతుందన్నారు. ఎస్‌పి దామోదర్ మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతూ ఎక్కువ మంది తలకు గాయం కావడం వల్లే చనిపోతున్నారన్నారు. దీంతో ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, హెల్మెట్ ధారణతో ప్రమాదాల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి (అడ్మిన్)కె.నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, ఒంగోలు డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, ఎఆర్ డిఎస్‌పి శ్రీనివాసరావు, ఒంగోలు తాలూకా సిఐ విజయకష్ణ, ఒంగోలు వన్ టౌన్ సిఐ నాగరాజు, టు టౌన్ సిఐ ఎం. శ్రీనివాసరావు, ట్రాఫిక్ సిఐ పాండు రంగారావు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్

జిల్లా సమగ్ర అభివృద్ధికి సహకరించాలి

జడ్‌పి చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు,అధికారులు సహకరించాలని జిల్లా పరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ కోరారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో స్థాయి సంఘాల సమావేశాలు బుధవారం నిర్వహించారు. ఈ సమావేశాల్లో ప్రకాశం జిల్లాకు చెందిన జడ్‌పిటిసిలు మూడు జిల్లాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన అంశాలకు అధికారులు సమాధానాలు ఇవ్వాలన్నారు. గత సమావేశంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సంతప్తికరమైన సమాధానాలు ఇచ్చారని ఆమె తెలియజేశారు ఇదే స్ఫూర్తితో రానున్న కాలంలో ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అజెండా ప్రకారం ముందుగా 2వ స్థాయీ సంఘమైన గ్రామీణాభివద్ధి లో భాగంగా డిఆర్‌డిఎ, హౌసింగ్ శాఖలకు సంబంధించి 3 జిల్లాల అధికారులు గత సమావేశాలలో సభ్యులు అడిగిన అంశాల పై తీసుకున్న చర్యలు, అలాగే ప్రస్తుతం పురోగతిలో ఉన్న పథకాలకు సంబంధించిన సమాచారం క్లుప్తంగా వివరించారు. 3వ స్థాయీ సంఘమైన వ్యవసాయ సంబంధిత అంశాలు,, 4 స్థాయీ సంఘమైన విద్య, వైద్య రంగంపై సమీక్ష నిర్వహించారు. 5వ కమిటీ స్త్రీ, శిశు సంక్షేమ కమిటీకి కొండపి జడ్‌పిటిసి మారెడ్డి అరుణ అధ్యక్షత వహించి సమీక్షించారు. 6వ స్థాయీ సంఘమైన సాంఘిక సంక్షేమం సమీక్షా సమావేశంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సంతప్తికరమైన సమాచారం ఇచ్చారు. 1, 7 స్థాయీ సంఘలైన పనులు ఆర్థిక విషయాల పై సమీక్షించటానికి 3 జిల్లాల పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖ, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ గత సమావేశాలలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు తీసుకున్న చర్యలు, కొత్తగా చేపట్టే చర్యలపై సమగ్ర సమీక్ష జరిపారు. స్థాయీ సంఘంలో ప్రతిపాదించిన పనులకు సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ సమావేశాలలో జిల్లా పరిషత్ సిఇఒ చిరంజీవి, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, జడ్‌పిటిసిలు, కో ఆప్షన్ సభ్యులు, మూడు జిల్లాల అధికారులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న జడ్‌పి చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

జిల్లా గ్రంథాయం ఆధునీకరణకు శ్రీకారం : జేసీ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలులోని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో రూ. 73 లక్షలతో ఆధునీకరణ పనులు చేపట్టనున్నట్లు సంయుక్త కలెక్టర్, జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌ఛార్జి ఆర్. గోపాలకష్ణ తెలిపారు. జేసీ చాంబర్ లో జిల్లా గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశం, జిల్లా గ్రంథాలయ సంస్థ సెస్ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గ్రంథాలయాల అభివద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగా జిల్లా గ్రంథాలయ సంస్థలో రూ. 73 లక్షల రూపాయలతో ఆధునీకరణ పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ ఆధునీకరణ పనులకు తొలి విడతగా రూ. 23 లక్షల నిధులను మంజురుచేసినట్లు జేసీ తెలిపారు. ప్రాపర్టీ టాక్స్ రూపంలో కలెక్ట్ చేసే లైబ్రరీ సెస్ మొత్తాలను సంబంధత నగర పాలక సంస్థలు, గ్రామ పంచాయతీలు వెంటనే జిల్లా గ్రంథాలయ సంస్థకు బకాయిలు లేకుండా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారిని జేసీ ఆదేశించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ వారీగా పెండింగ్ లో వున్న లైబ్రరీ సెస్ బకాయిలపై జాయింట్ కలెక్టర్ సమీక్షించారు. దిన, వార పక్ష, మాస పత్రికల వివరాలు, వివిధ పోటీ పరీక్షలు సంబంధించిన పుస్తకాల వివరాల గురించి ఆరా తీశారు. గ్రంథాలయాల అభివద్ధికి సంబంధించి 2025-26 బడ్జెట్ ను, కందుకూరు, వలేటివారిపాలెం, ముండ్లమూరు, కొమరోలు శాఖా గ్రంథాలయాల భవనాలకు 5 శాతం అద్దె పెంపు వంటి అంశాలను సమావేశంలో కమిటీ ఆమోదించింది. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శివా రెడ్డి, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వర రావు, జిల్లా పంచాయతీ అధికారి జి.వెంకట నాయుడు, పబ్లిక్ హెల్త్ ఇఇ శ్రీనివాస సంజయ్, ఆడిట్ అధికారి రమేష్, ఉమ్మడి ప్రకాశం జిల్లా లోని అన్ని మున్సిపాలిటీల కమిషనర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థినులతో అధ్యాపకులు

ప్రాంగణ ఎంపికల్లో 13 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మలినేని సుశీలమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 13 మంది ఉద్యోగాలు సాధించినట్లు ఆ కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు తెలిపారు. ప్రముఖ బహుళ జాతి సంస్థ సావంటిస్ కంపెనీ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు రెండున్నర లక్షల నుంచి మూడున్నర లక్షల వరకు జీతాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఆర్థిక మాంద్యం పరిస్థితుల్లో మలినేని సుశీలమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు 13 మందికి ఉద్యోగాలు రావడం చాలా ఆనందకరమని వివరించారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు, పిన్సిపల్ డాక్టర్ అన్నమనేని గోపాలకష్ణమూర్తి, ఉపాధి కల్పన అధికారి ఆర్.స్రవంతి అభినందించారు.



ఆర్‌టిసి డిఎంకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

వేములపాడుకు రెగ్యులర్ బస్సు నడపాలని వినతి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఒంగోలు నుంచి సంతనూతలపాడు మండలం వేములపాడు గ్రామానికి రెగ్యులర్ ఆర్‌టిసి బస్సు నడపాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధులు ఒంగోలు డిపో మేనేజర్ ఘట్టమనేని శ్రీనివాసరావును బుధవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వేములపాడు గ్రామానికి బోయళ్ల వెంగళరావు, అనమలకుర్తి వెంకటరత్నం, ఎల్.నాగేశ్వరరావు, ఎ. నరసయ్య మాట్లాడుతూ ప్రస్తుతం బస్సు వస్తుందో, రాదో తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. తమ గ్రామం శివారు ప్రాంతంలో ఉందన్నారు. కనీసం ఆటోలు కూడా రావని తెలిపారు. ద్విచక్ర వాహనాలు లేనివారు నాలుగు కిలోమీటర్లు నడిచి చిలకపాడు వరకు వెళ్లి బస్సు ఎక్కాల్సిన పరిస్థితి ఉందని వివరించారు. ప్రజల సమస్యలను దష్టిలో ఉంచుకొని గ్రామానికి రోజూ బస్సు నడపాలన్నారు. మధ్యాహ్నం 1.30 కి ప్రత్యేక ట్రిప్ ఏర్పాటు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. దీంతో స్పందించిన డిపో మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ అంశాన్ని పరిశీలించి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి రోజూ బస్సు నడపటానికి ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నెరుసుల వెంకటేశ్వర్లు, కంకణాల ఆంజనేయులు, ఎస్ఎన్ పాడు మండల కార్యదర్శి అన్నవరపు శేషారావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య పాల్గొన్నారు.

విద్యార్థినులకు అవగాహన

ప్రజాశక్తి-కంభం రూరల్

స్థానిక అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలోని విద్యార్థినులకు కంభం ఎస్ఐ బి నరసింహారావు ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలన, మహిళల రక్షణ, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ హరిబాబు

మహిళల రక్షణ కవచం 'శక్తి యాప్'

ప్రజాశక్తి - కారంచేడు

గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై విద్యార్థులు అవగాహన కలిగివుండాలని చీరాల సబ్ డివిజన్ శక్తి బృందం ఎస్ఐ హరిబాబు తెలిపారు. ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు చీరాల డిఎస్పీ మోయిన్ సూచనలతో సబ్ డివిజన్ శక్తి బృందం మండలంలోని స్వర్ణ జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. మహిళల రక్షణ కోసం శక్తి యాప్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, మహిళా సంబంధిత నేరాలు, బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలు, సైబర్ నేరాల గురించి వివరించారు. మహిళలకు అత్యవసర పరిస్థితుల్లో శక్తి యాప్‌తోపాటు 79934 85111 వాట్సాప్ నెంబర్ కూడా అందుబాటు లోకి తెచ్చినట్లు తెలిపారు. ఆ నెంబర్‌కు సమాచారం ఇచ్చిన వెంటనే శక్తి బృందాలు స్పందించి సహాయం అందిస్తారని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 100, 112, 1098, 181, 1930, 1972 నెంబర్లకు ఫోన్ చేయవచ్చని అవగాహన కల్పించారు. ఎస్ఐ షేక్ ఖాదర్ భాషా, ఎఎస్ఐ సాయి, శక్తి బృందం సభ్యులు కె సుబ్బారావు, సుమతి, ధనలక్ష్మి, లోకేష్, పాఠశాల హెచ్ఎం పాల్గొన్నారు.



చూడు గేద మృతి, రెండు గేదెలకు గాయాలు

షార్ట్ సర్క్యూట్‌తో గొడ్ల చావడి దగ్ధం

ప్రజాశక్తి - రేపల్లె

షార్ట్ సర్క్యూట్‌తో పశువుల చావిడి దగ్నమైన సంఘటన మండలంలోని పేటేరులో మంగళవారం చోటుచేసుకుంది. బాధితులు వాకా సాంబశివరావు తెలిపిన వివరాల ప్రకారం ఎప్పటిలాగే పశువుల చావడిలో కట్టేసి నిద్రపోతున్న సమయంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక చూడు గేద చనిపోగా రెండు గేదలు గాయాల పాలయ్యాయని తెలిపారు. సమాచారం అందుకున్న పశు వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ హుటా హుటిన ప్రమాదం జరిగిన స్థలానికి సిబ్బందితో వచ్చి కాలిన పశువులకు అత్యవసర వైద్య సహాయం అందించారు.

దేవాలయ భూముల బహిరంగం వేలం

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని రామకూరులోని రామలింగేశ్వర స్వామి దేవస్థానంకు చెందిన 21.31 ఎకరాల భూమి కౌలు బహిరంగ వేలం పాట శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో జరుగుతుందని దేవస్థానం కార్యనిర్వహణాధికారి సుబ్బారావు బుధవారం తెలిపారు. రామకూరుకు చెందిన సర్వే నెంబర్ 136లో 12 ఎకరాలు, సర్వేనెంబర్ 149లో 8.31 ఎకరాలు మెట్ట భూమి కౌలు వేలం జరుగు తుందని చెప్పారు. ఈ కౌలు 2025 -26 నుండి 2027 -28 వరకు అనగా రెండేళ్ల పాటు కాలపరిమితి ఉంటుందని తెలిపారు. ఈ దేవాలయంనకు గతంలో బాకీ ఉన్నవా రు గానీ, లావాదేవీలు ఉన్నవారు గానీ ఈ పాటలో పాల్గొన రాదని తెలిపారు. పాటలో పాల్గొనేవారు తమ స్థితిగతులు తెలిపి, పాటకు ముందు రూ.5వేల ధరావత్తు చెల్లించాలని చెప్పారు. హెచ్చుపాటదారుడు డిపాజిట్ కాక హెచ్చుపాట మొత్తం వెంటనే చెల్లించాలని, అలా చెల్లించకపోతే మరల భూముల పాట జరుపుతామని, మొదట చెల్లించిన ధరావత్తు అపరాధం క్రింద దేవస్థానం జమ చేసుకుంటుందని తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల ఉత్తర్వులకు లోబడి జరుగుతున్నట్లు తెలిపారు. మిగిలిన షరతులు వేలం పాటకు ముందుగా తెలియజేస్తామని చెప్పారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - రేపల్లె

పట్టణంలో వివిధ అభివృద్ధి పనులకు మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు అనగాని శివప్రసాద్ బుధవారం శంకుస్థాపన చేశారు. పట్టణంలో 1, 28 వార్డుల్లో సిసి రోడ్డు, డ్రైన్, 6వ వార్డులోని కుప్పంవారి వీదిలో సిసి డ్రైన్, 22వ వార్డులో సిసి రోడ్డు, కల్వర్టు, 12వ వార్డులో కమ్యూనిటీ హాలు, సిసి రోడ్లు, డ్రైన్, 13వ వార్డు చిరువోలువారివీదిలో సిసి రోడ్, 13వ వార్డు మెలికావారివీది శ్రీ సత్య అమరావతి రోడ్డులో సిసి రోడ్డు, 17వ వార్డులో సిసి రోడ్డువైపు లైను, 19వ వార్డు మండవవారివీది సిసి రోడ్లు, డ్రైన్లలకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. వార్డుల్లో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణ పశ్చిమ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ పి మురళీధంరావు, టిడిపి పట్టణ అధ్యక్షులు మేక రామకృష్ణ, మాజీ అధ్యక్షులు పట్టాభి రామారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ విశ్వనాథ గుప్తా, ఎం అంకాలు, కొలుసు శ్రీనివాసరావు, షేక్ జమీర్, కౌన్సిలర్ ఆకురాతి గంగమ్మ, కౌతరపు వెంకట నాంచారరావు, షేక్ సుభాని, గోగినేని శ్రీనివాసరావు, ఎస్ఎస్‌వి ప్రసాద్, కౌతరపు శోభన్ బాబు, పంతాని సాయికుమార్, బడుగు వెంకటనారాయణ, కేసన నరసింహ, వై ధర్మతేజ, ఆలపాటి వేణుగోపాలరావు, దేవగిరి రవిశంకర్, కొలుసు గౌరీ, డొక్కు రామకృష్ణ, కొలుసు రెడ్డయ్య, కొలుసు రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ కె సాంబశివరావు, డిఈఓ మధుసూదనరావు, ఎఇ జాన్ సామ్యూల్ పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న శివప్రసాద్

'టంగుటూరి' జీవితం నేటి తరానికి ఆదర్శం

ప్రజాశక్తి - బాపట్ల

పౌరుషానికి ప్రతీక ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు అని ఒంగోలు ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య డివిఆర్ మూర్తి అన్నారు. ప్రకాశం అభివృద్ధి, అధ్యయన సంస్థ ఫోరం ఫర్ బెటర్ బాపట్ల సంయుక్తంగా నిర్వహించిన టంగుటూరి ప్రకాశం స్మారక ఉపన్యాసంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకాశం చూపిన తెగువ జాతీయ స్థాయిలో ఆంధ్రులకు ప్రత్యేక గుర్తింపు, కీర్తి ప్రతిష్టలు ఆర్జించి పెట్టిందని అన్నారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన పాత్ర అమోఘ మైనదని అన్నారు. రూ.లక్షలు అర్జించినా చివరకు దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించారని చెప్పారు. అర్థ శతాబ్ది పాటు తెలుగు రాజకీయాలను ఆయన శాసించారని అన్నారు. ఆయన జీవితం, వ్యక్తిత్వం నేటి తరానికి ఆదర్శప్రాయం కావాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ కోన రఘుపతి, ప్రకాశం అభివృద్ధి అధ్యయన సంస్థ అధ్యక్షులు టి మోహనరావు, కార్యదర్శి టంగుటూరి శ్రీరామ్, ఆర్ట్స్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డబ్ల్యూ ఎజికె మూర్తి, ఫోరం కార్యదర్శి పిసి సాయిబాబు, రైస్ మిలర్స్ జిల్లా అధ్యక్షులు బివి రత్నగుప్త, యూవి రామారావు, విశ్రాంత అధ్యాపకులు శాంతారాం, బార్ అధ్యక్షులు అవినాష్, సీనియర్ సిటిజన్స్ బందా బాబు, న్యాయవాదులు భానుప్రకాష్, కె రవి బాబు, సీతారామాంజనేయులు, చలపతిరావు, చిత్రకారుడు జివి, మానం అప్పారావు, అర్బన్ బ్యాంక్ అధ్యక్షుడు గర్నెపూడి వెంకటేశ్వర్లు, అబ్దుల్ కలాం, ఇక్కుర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డివిఆర్ మూర్తి

పేదరిక నిర్మూలనే 'పి4' లక్ష్యం

ప్రజాశక్తి - నిజాంపట్నం

పేదరిక నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'పి4' కార్యక్రమం చేపట్టిందని ఎంపిడిఒ నర్రా నాగలక్ష్మి అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పి4 బంగారు కుటుంబాలు, మార్గదర్శిలకు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో జడ్పిటిసి నర్రా సుబ్బయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలను ఉన్నత స్థాయి కుటుంబాలుగా తీర్చిదిద్దేందుకు పి4 కార్యక్రమం చేపట్టిందని అన్నారు. పేద ప్రజలు తమ వివరాలను గ్రామం పరిధిలోని అధికారులకు తెలియజేయాలని కోరారు. మండలంలో 114 బంగారు కుటుంబాలకు 33మంది మార్గదర్శకులను గుర్తించినట్లు తెలిపారు. బంగారు కుటుంబాలకు ఆర్థికంగా, సామాజికంగా తగిన సహాయ సహకారాలు మార్గదర్శులు అందించాలని కోరారు.



మాట్లాడుతున్న జెడ్‌పిటిసి నర్రా సుబ్బయ్య

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - నగరం

చిన్నగంజాం మండలం కుక్కల వారిపాలెంకు చెందిన కుక్కల నరసింహారెడ్డి తండ్రి ఏడుకొండలురెడ్డి (21) తన ఇద్దరు స్నేహితులైన పవన్, రామకృష్ణతో కలిసి సజ్జవారిపాలెంలో రోడ్డు మార్గంలో ఇంట్లో ఉంటూ ఫ్రెండ్స్‌తో కలిసి పోస్టల్ జాబ్‌కు సిద్ధం అవుతున్నారు. జులై 22న రాత్రి స్నేహితులు మధ్య పక్క ఇంటి వారితో చెట్టుకొమ్మ విషయంలో గొడవ జరిగి అరుసుకున్నారు. స్నేహితులు ఇద్దరూ ఇంట్లో లేని సమయంలో నరసింహారెడ్డి క్షణికావేశంలో మన స్థాపం చెంది ఇంటి ముందున్న చెట్టుకు ఉరేసుకొని మృతి చెందాడు. మృతుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ బండ్ల భార్గవ్ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

ఆర్టీసీ ఇంద్ర ఏసీ బస్సు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన స్థానిక బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద బుధవారం చోటు చేసుకుంది. హైవే పెట్రోలింగ్ సిబ్బంది అశోక్ చెప్పిన వివరాలు ప్రకారం ఒంగోలు డిపోకు చెందిన ఇంద్ర ఎసి బస్సు విజయవాడ నుండి ఒంగోలు వెళుతున్న క్రమంలో బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద రోడ్డు దాటుతున్న గుర్తు తెలియని వ్యక్తిని ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని బస్సును పోలీసు స్టేషన్‌కు తరలించారు. ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి యాచకుడిగా అనుమానిస్తున్నారు.



మాట్లాడుతున్న శ్రావణ్ కుమార్

ఫొటో గ్రాఫర్లకు వర్క్‌షాపు

ప్రజాశక్తి - రేపల్లె

మారుతున్న కాలానికి అనుగుణంగా డిజిటల్ ఇండియాలో అధునాతన డిజిటల్ కెమెరాలపై ఫోటోగ్రాఫర్లకు నికాన్ కంపెనీ ఆధ్వర్యంలో ఫోటో గ్రాఫర్లకు వర్క్‌షాప్ బుధవారం నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నికాన్ మెమోరియల్ డెమో వర్క్ షాపు నిర్వహించారు. డిజిటల్ కెమెరాల్లో స్లో మోషన్, కలర్స్, రివిల్యేషన్, తదితర అంశాలపై మాస్టర్ కెవి శ్రావణ కుమార్ వివరించారు. కెమెరాల సేల్స్ స్టాల్‌లో డిజిటల్ కెమెరాల కొనుగోలు నిమిత్తం అందుబాటులో ఉంచారు. కార్యక్రమంలో నికాన్ ఎఎస్ఎం రంజిత్ కుమార్, ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు పందర బోయిన శ్రీనివాసరావు (గోపి), వడ్డే రామచంద్ర ప్రభు, తోట శ్రీహరి, బత్తుల మలి, కర్ర రాజేష్, వాసు, మురళి, శ్రీను పాల్గొన్నారు.



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ చౌదరి

హెల్మెట్ ధరించాలి : ఎస్ఐ

ప్రజాశక్తి - పర్చూరు

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ జివి చౌదరి పేర్కొన్నారు. స్థానిక వై జంక్షన్ వద్ద వాహనాలను ఆయన బుధవారం తనిఖీ చేశారు. హెల్మెట్ ధరించకుండా బైకుపై వెళుతున్న వారికి అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా ద్విచక్ర వాహనదారులు తలకు దెబ్బలు తగిలి మృతి చెందిన సంఘటనలు ఉన్నాయని తెలిపారు. హెల్మెట్ కొంతమేర తలకు రక్షణగా ఉంటుందని అన్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. వాహనాలు నడిపే వారికి తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని పేర్కొన్నారు. వాహనాల్లో గజాయి, మత్తు పదార్థాలు తరలిస్తున్న నేపథ్యంలో కార్లు, ఇతర వాహనాలు తనిఖీలు చేశారు. డ్రింక్ చేసి వాహనాలు నడిపితే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు.



విశ్రాంత ఐఎఎస్ విజయ్‌కుమార్‌తో నాయకులు

విజయ్‌కుమార్‌ను కలిసిన నాయకులు

ప్రజాశక్తి - యద్దనపూడి

యద్దనపూడి, మార్టూరు మండలాలకు చెందిన యువకులు, నాయకులు విశ్రాంత కలెక్టర్, లిబరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు దళాధిపతి జిఎస్ఆర్‌కె విజయ్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఓటర్‌కు ఓటు విలువ తెలియ జెప్పశాలని, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీలు అందరు ఐక్యంగా వారి ఓటు వారికే వేసుకుని రాజ్యాధికారం సాధించాలని చెప్పారు. గ్రామాల్లో ఉన్న పేదలు తమ ఓటు అమ్ముకోకుండా నిజాయితీగా, స్వతంత్రంగా ఓటు వేసుకునే విధంగా అవగాహన కల్పించాలని అన్నారు. ఓటుపై ఒక అభిప్రాయం ఆయన అడిగి తెలుసుకున్నారు. దళాధిపతిని కలిసిన వారిలో మార్టూరుకు చెందిన అంబేద్కర్ సొసైటీ అధ్యక్షుడు మైలా నాగేశ్వరరావు, యద్దనపూడి మండలం అనంతవరం గ్రామ 5వ వార్డు సభ్యులు టి సుభాష్, అమర్నాథ్, అఖిల్ బాబు పాల్గొన్నారు



రచ్చబండ కార్యక్రమంలో కోన రఘుపతి

వైద్య కళాశాల నిర్మిస్తేనే అభివృద్ధి

ప్రజాశక్తి - బాపట్ల

వైద్య కళాశాల నిర్మాణం జరిగి ఉంటే ఈ ప్రాంతం ఆర్థికంగా అభివృద్ధి చెంది ఉండేదని మాజీ శాసన సభ్యులు కోన రఘుపతి అన్నారు. పట్టణంలోని 24వ వార్డులో రచ్చబండ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మంగళగిరి ఎన్నారై వైద్య శాల నిర్మాణం వల్ల ఎవరికి ఉపయోగం లేదని, నాలుగు గోడల మధ్య డబ్బున్న వారికే వైద్యం అందుతుందని, నిరుపేదలకు అక్కడ వైద్యం అందే పరిస్థితి లేదని అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని, చంద్రబాబు మోసగాడని విమర్శించారు. రాజుకి బాగా డబ్బు ఉందని సొంత డబ్బుతో అన్ని సమకూరుస్తాడని నమ్మిన నియోజకవర్గ ప్రజలు మోసపోయారని అన్నారు. రఘుపతికి బాపట్ల అవసరం లేదు. బాపట్లకే రఘుపతి అవసరం ఉందని అన్నారు. రఘుపతి వల్లనే బాపట్ల అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి చేజర్ల నారాయణరెడ్డి పాల్గొన్నారు.



శిక్షణా తరగతులను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

గ్రామీణాభివృద్ధికి సాంకేతికత అనుసంధానం

ప్రజాశక్తి - బాపట్ల

దేశానికి పట్టుకొమ్మలైన గ్రామీణ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు గ్రామీణాభివృద్ధి సంస్థ సమర్ధవంతంగా కృషి చేస్తోందని ఐఎఫ్ఎస్ డైరెక్టర్ ఈజిఎస్ వైవి షణ్ముఖ కుమార్, రూరల్ డెవలప్మెంట్ అడిషనల్ కమిషనర్ మల్లెల శివప్రసాద్ అన్నారు. బాపట్ల విస్తరణ శిక్షణా కేంద్రంలో బుధవారం నిర్వహించిన జియో టాకింగ్, జియో ఫెన్సింగ్ అనే అంశంపై 26 జిల్లాలకు చెందిన మాస్టర్ ట్రైనర్స్‌కు శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా 160 మంది మాస్టర్ ట్రైనర్స్‌కు శిక్షణ ఇచ్చారు. ఇక్కడ శిక్షణ పొందిన శిక్షకులు క్షేత్రస్థాయిలో టెక్నికల్, ఎఫ్ఎ సిబ్బందికి శిక్షణ ఇస్తారని అన్నారు. కార్యక్రమంలో ఇటిసి వైస్ ప్రిన్సిపల్ పద్మజ, డి నరేంద్ర బాబు, కె స్వరూపరాణి, జెవి సునీల్, గౌరీ శంకర్, రిసోర్స్ పర్సన్‌లు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలోని భవాని సెంటర్ వద్ద ఉన్న రీడింగ్ రూం స్థలంలో టౌన్ హాల్ నిర్మాణానికి స్థలాన్ని మున్సిపల్ కమిషనర్ బి రవీంద్ర, ఎఇ లోకేష్, అధాని గ్రూపు ప్రతినిధి బుధవారం పరిశీలించారు. ఈ నిర్మాణం కోసం రూ.3.50 కోట్ల సిఎస్ఆర్ నిధులు మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమకూర్చారు. ఈ వేసవి నాటికి నిర్మాణం పూర్తిచేసి ప్రారంభించేందుకు కృషి చేస్తామని తెలిపారు.ం

కౌలు రైతు గుర్తింపు కార్డులు పొందాలి


ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని యనమదల, యద్దనపూడి గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం బుదవారం నిర్వహించారు. కౌలుకు పొలం సాగు చేసే రైతులు సిసిఆర్సి కార్డులు పొందడం ద్వారా అనేక ప్రయోజనాలు పొందవచ్చని ఎఒ కుమారి తెలిపారు. ప్రతి పంటకు భీమా చేసుకోవడానికి జులై 31 వరకు అవకాశం ఉందని తెలిపారు. విత్తనాలు కొనుగోలు చేసేటపుడు లైసెన్స్ ఉన్న డీలర్ల దగ్గరే కొనాలని, తప్పకుండా రశీదు పొందాలని చెప్పారు. పొగాకును 20 శాతం కన్నా తక్కువ తేమ ఉండేటట్లు చూసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎఇఒ మధుప్రియ, రైతులు సుబ్బారావు, వెంకటేశ్వర్లు, రాజు, వెంకట్రావు, రెండు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రమేష్‌బాబుకు డిప్యూటీ ఎంపిడిఒగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - చీరాల

కొత్తపేట పంచాయతీ కార్యదర్శిగా విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన కార్యదర్శి బడుగు రమేష్ బాబు సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. పంచాయతీలో కార్యదర్శిగా సేవలు అందించిన ఆయన డిప్యూటీ ఎంపీడీఒగా పదోన్నతిపై గిద్దలూరు బదిలీ కావడంతో ఆయనకు బిఎస్ఆర్ ఫంక్షన్ హాలులో వీడ్కోలు సభ బుధవారం నిర్వహించారు. కొత్తపేట పంచాయతీ నూతన కార్యదర్శి వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఘనంగా రమేష్‌బాబు దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ కార్యదర్శిగా విధి నిర్వహణలో పంచాయతీ అభివృద్ధికి శాసన సభ్యులు మద్దలూరి మాల కొండయ్య, నియోజకవర్గ అధికార ప్రతినిధి మహేంద్ర నాథ్ ఎంతగానో సహకరించారని అన్నారు. వారి సహకారంతో అనేక అభివృద్ధి పనులు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు, ఎఎంసి ఛైర్మన్ కౌతరపు జనార్ధన్, వాడరేవు, కొత్తపేట మాజీ సర్పంచ్‌లు ఎరిపిల్లి రమణ, చుండూరి వాసు పాల్గొన్నారు.



రమేష్ బాబు దంపతులను సన్మానిస్తున్న సిబ్బంది

రైతులకు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న టిడిపి నాయకులు శివప్రసాద్

ప్రజాశక్తి - రేపల్లె

వ్యవసాయ పనులు ప్రారంభమైనందున రైతులకు వ్యవసాయ అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని టిడిపి నాయకులు, మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ వ్యవసాయ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎడిఎ లక్ష్మి మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో సిబ్బంది బదిలీలపై రావడం, పోస్టింగులలో జాయిన్ అవ్వడం వలన సమావేశం సమీక్ష సమావేశం నిర్వహించామని అన్నారు. సమావేశంలో కృష్ణ పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళిధరరావు, రేపల్లె ఎడిఎ ఎ లక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

కొల్లూరు : మండలంలోని దోనేపూడి, చిన్న పులివర్రు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఎఒ వి నరేంద్రబాబు గ్రామసభ నిర్వహించారు. రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ పంట నమోదుపై రైతులుకు అవగాహన కల్పించారు. ఈనెల 23 నుండి ఈ పంట నమోదు జరుగుతుందని తెలిపారు. కావున రైతులు ఆర్ఎస్‌కెల్లో సంప్రదించి ఈ పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. కౌలు గుర్తింపు కార్డులు అందజేశారు.

కారంచేడు : పొగాకుకు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని ఎఒ నాగరాజు చెప్పారు. మండలంలోని జరుబులవారిపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. రైతులు పొగాకు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని, అన్నదాత సుఖీభవ, ఈకెవైసి పెండింగ్ ఉన్నవారు, ఎన్‌పిసిఐ లింక్ లేనివారు ఇనాక్టివ్‌లో ఉన్నవారి జాబితా రైతు సేవకేంద్రంలో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. రైతులు ఆ జాబితా పరిశీలన చేసుకోవాలని అన్నారు. కౌలు రైతు కార్డుల ప్రాముఖ్యత తెలిపారు.

వేటపాలెం : బలమైన పంట నిలబెట్టుకోవడం వల్ల కలుపు మొక్కలను నియంత్రించ వచ్చని ఎడిఎ టి రత్నకుమారి అన్నారు. మండలంలోని కొత్తపేట2, చల్లారెడ్డిపాలెం2 రైతు సేవాకేంద్రాల పరిదిలో పోలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఖరీఫ్ సీజన్లో రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలను ఎఒ ఎం సరిత వివరించారు. నాన్యమైన వరి విత్తనాలను ఎంపిక చేస్కోవాలని సూచించారు. కార్యక్రమంలో విఎఎలు స్వాతి, శ్రావ్య పాల్గొన్నారు.

అద్దంకి : రైతులు ఈ పంట తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఎఒ కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. మండలంలోని కుంకుపాడు, కోటికలపూడి గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు సాగు చేసిన పంటలు నమోదు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ పూనాటి విక్రమ్, కోట శివయ్య, గాలం వెంకటేశ్వర్లు, ఎఇఒ కోటేశ్వరరావు, ఉద్యాన శాఖ అధికారిణి సుకన్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అద్దంకి ఎఒ కొర్రపాటి వెంకటకృష్ణ

కల్తీ మద్యంతో ఆరోగ్యానికి ప్రమాదం

ప్రజాశక్తి - బాపట్ల

రాష్ట్ర ప్రభుత్వం వినియోగదారులకు నాణ్యమైన మద్యం సరఫరాకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ప్రోహిబిషన్ ఎక్సైజ్ అధికారి బి వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎ4 మద్యం దుకాణాలు, లైసెన్స్ బార్ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. మద్యం బాటిల్స్ అమ్మేటప్పుడు తప్పనిసరిగా బాటిల్‌పై కాలపరిమితిని పరిశీలించాలని అన్నారు. కాలపరిమితి దాటిన బాటిల్స్ అమ్మితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కంట్రోల్ రూమ్ నెంబర్ 14405కు గాని, ప్రోహిబిషన్, ఎక్సైజ్ అధికారి 98499 90288 సెల్ నెంబర్‌కు సమాచారం ఇవ్వలని కోరారు. సమావేశంలో లైసెన్స్ మద్యం దుకాణాల నిర్వాహకులు, ఎక్సైజ్ సిఐ పి గీతిక, ఎస్ఐ డి ప్రభుదాస్, ఎస్ మౌనిక పాల్గొన్నారు.

నగరం : ప్రజల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం వినియోగదారులకు నాణ్యమైన మద్యం సరఫరాకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, కల్తీ మద్యం గురించి ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే స్థానిక ప్రోహిబిషన్, ఎక్సైజ్ సిఐ ఎం శ్రీరామ్ ప్రసాద్‌కు తెలియజేయాలని కోరారు. తప్పనిసరిగా బాటిల్ కాలపరిమితి పరిశీలించాలని చెప్పారు. కాలపరిమితి దాటినా బాటిల్స్ అమ్మితే చట్టరీత్యా నేరమని అన్నారు. వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. దీనికి సంబంధించి ఎవరికైనా అనుమానాలు ఉంటే కంట్రోల్ రూంకు 14405, స్థానిక సిఐ 94904 55599 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.



బాపట్లలో సమావేశంలో ఎక్సైజ్ అధికారులు



ఆర్థిక సాయం అందజేస్తున్న గౌడ సంఘీయులు

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని వెల్లటూరులో నెల రోజుల క్రితం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో లుక్కా సీతారామయ్యకు చెందిన పూరి ఇల్లు పూర్తిగా కాలిపోయింది. పేదవాడైన అతనికి గుంటూరు జిల్లా గీత బందు సేవా ట్రస్ట్ అధ్యక్షులు వీరంకి రంగారావు గౌడ సంఘ తరపున రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం మండల అధ్యక్షులు, గీత బంధు సేవా ట్రస్ట్ సభ్యులు అనగాని ఏడుకొండలు, తెలుగుదేశం మండల కన్వీనర్ వాకా శేషుబాబు, మోటూరు పుణ్య శ్రీనివాసరావు, ఎంపిటిసి వెంకట నారాయణరావు, బొర్రా సాంబయ్య, సర్పంచ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహశీల్దారు శ్రీనివాసరావు

రైతులతో మమేకం కావాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు : మండలంలో బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టిన వ్యవసాయ సహాయకులు ఎప్పటికప్పుడు రైతులతో మమేకమై అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని తహశీల్దారు మేకా శ్రీనివాసరావు సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎఒ బ్రహ్మారెడ్డి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. మండలం లోని పెదపులివర్రు, సూరేపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోం ది కార్యక్రమం నిర్వహించారు. ఎఒ బి బ్రహ్మారెడ్డి మాట్లా డుతూ రైతులు తమ పంటలకు భీమా చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఇఒలు కె లక్ష్మీ ప్రసన్న, వి బుష్, టి అఖిల, విహెచ్ఎ గోపి రాజు, నరేష్, రైతులు నీలా రమేష్, సురేష్ పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి జైలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు : భార్యతో అసభ్యకరంగా ప్రవర్తించినాడని భర్త అడిగి నందుకు ముద్దాయి అయిన పడవల వెంకటేశ్వరరావు హత్యాయత్నం చేశాడన్న అభియోగంపై నేరం రుజువు కావ డంతో ఆరేళ్ల జైలు శిక్ష, రు.25 వేలు జరిమానా విధిస్తూ రేపల్లె అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎస్‌పిడి వెన్నెల తీర్పునిచ్చారు. ఎస్ఐ ఎం శివయ్య తెలిపిన వివరాల ప్రకారం భట్టిప్రోలుకు చెందిన జక్కం రామకృష్ణ అనే వ్యక్తి ఆర్‌కె జ్యువెలర్స్ షాపు నడుపుకుంటూ ఉంటాడని, 2017 సెప్టెంబర్ 11న ముద్దాయి అయిన పడవల వెంకటేశ్వర రావు రామకృష్ణ భార్యకు సైకిల్‌పై వస్తు తగలగా ఆమె నీకు కళ్ళు కనిపించవాని అడగగా ముద్దాయి ఆమెను చంపేస్తా నని బెదిరించి, తన వెంటే తెచ్చుకున్న పదునైన చాకుతో డొక్కలో, ఛాతి మీద పొడవడంతో బలమైన గాయమైనది. దీంతో అప్పటి ఎస్ఐ ఈ బాలనాగరెడ్డి, అప్పటి రేపల్లె రూరల్ సిఐ పివి ఆంజనేయులు పర్యవేక్షణలో 112/2017 యు/ఎస్ 307, 324, 506, 509 ఐపిసి సెక్షల పరిధిలో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో తగిన సాక్షాదారాలతో ముద్దాయి నేరం చేసినట్లు నిర్ధారించి అరెస్టు చేసి కోర్టుకు హాజరు పర్చారు. రేపల్లె అసిస్టెంట్ సెషన్స్ కోర్ట్ జడ్జి కోర్టులో కేసు విచారణ ప్రారంభమైనప్పటి నుండి ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు ఎస్ఐ ఎం శివయ్య సాక్షులకు సరైన రీతిలో ధైర్యంగా సాక్ష్యం చెప్పే విధంగా తర్ఫీదు ఇవ్వడంతో కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్ కెఎలీషాబాబు వారిని కోర్టులో హాజరు పర్చారు. కోర్ట్ పిపి అనగాని శ్రీనివాసమూర్తి సరైన రీతిలో వాదించి ముద్దాయిపై మోపబడిన నేరాన్ని సాక్షాదారాలతో నిరూపించారు. దీంతో న్యాయమూర్తి ఎస్‌పిడి వెన్నెల ముద్దాయికి శిక్ష విధించారని ఎస్ఐ తెలిపారు.

'అక్షర ఆంధ్ర'ను విజయవంతం చేయాలి

బాపట్ల జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట మురళి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె. వెంకట మురళి అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ లో అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించడానికి తీసు కోవాల్సిన చర్యలపై కలెక్టర్ అధికారులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్షరాస్యత పెంపుకు బహు శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. అక్షర ఆంధ్ర కార్యక్రమం కోసం గ్రామ స్థాయిలో వయోజన విద్యా కేంద్రాల ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు. ఉల్లాస్– అక్షర ఆంధ్ర కార్యక్రమంలో జీవితాంతం నేర్చుకునే అవకాశాల కల్పన కోసం కేంద్రం ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. సమావేశంలో వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ నరసింహారావు,, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్,జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి రాధా మాధవి,విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు


విద్యార్థులతో నిర్వాహకులు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు మీడియా కెమెరామన్ అసోసియేషన్ హాలులో ప్రకాశం జిల్లా అభివృద్ధి వేదిక, ఒపిడిఆర్, ప్రజా సంఘాలు, రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో భారత రాజ్యాంగం– కనీస అవగాహన అనే అంశంపై వక్తత్వ పోటీలు నిర్వహిస్తున్నారు. బుధవారం నిర్వహించిన పోటీలకు కొండపి మండలం ముప్పవరం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు,కందుకూరు మండలం మాచవరం జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా అభివద్ధి వేదిక అధ్యక్షుడు చుండూరి రంగారావు మాట్లాడుతూ జిల్లా ప్రజలకు భారత రాజ్యాంగం పట్ల అవగాహన కల్పించేందుకు ఈ పాటీలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే రాజ్యాంగం పట్ల అవగాహన కలిగి ఉంటే భావిభారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఉంటుందన్నారు.ఈ పోటీలు ఈనెల 26 వరకూ కొనసాగుతాయని తెలిపారు.. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ధూళిపాళ్ల వెంకటేశ్వర్లు ,గడ్డం మురహరరావు, విశ్రాంత ఉప కలెక్టర్ పల్లపాటి పేరయ్య వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఒపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్ రావు, కెఎన్పిఎస్ జిల్లా సంయుక్త కార్యదర్శి మేడికొండ జార్జి, కొండపి మండలం ముప్పవరం ఆంగ్ల ఉపాధ్యాయులు రవీంద్ర , విద్యార్థులు పాల్గొన్నారు.

'పిఎం సూర్య ఘర్' పై విస్తృత అవగాహన : కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి- ఒంగోలు కలెక్టరేట్

పిఎం సూర్య ఘర్ పథకంపై ప్రజలకు విస్తతంగా అవగాహన కల్పించి, నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పిఎం సూర్య ఘర్ పథకం అమలు పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పిఎం సూర్య ఘర్ పథకంలో ఇప్పటివరకూ 83,013 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. అందులో 1890 దరఖాస్తులు గ్రౌండింగ్ చేసినట్లు తెలిపారు.1754 మందికి సోలార్ ఇన్సులేషన్ పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లాలోని తూర్పు నాయుడుపాలెం, శంఖవరం, నాగంబొట్లపాలెం, శింగరాయకొండ, బేస్తవారిపేట గ్రామాలను ప్రత్యేక గ్రామాలుగా ఎంపిక చేసి ఆయా గ్రామాల్లో సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు చేపట్టిన చర్యలు, సాధించిన పురోగతిపై ఈ సందర్భంగా కలెక్టర్ సమీక్షించారు. ఎక్కడైనా సబ్సిడీ రిలీజ్ చేయడంలో సమస్యలు ఉంటే వెంటనే ఎల్డిఎం దష్టికి తీసుకెళ్లాలన్నారు. క్షేత్ర స్థాయిలో అన్నీ వర్గాల ప్రజలను, ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేసి అన్ని గ్రామాల్లోనూ సౌర విద్యుత్ వినియోగం పెరిగేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. సౌర విద్యుత్ వినియోగంతో కలిగే ప్రయోజనాలను, ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీని ప్రజలకు వివరించేలా డివిజన్ ఇఇలు ప్రత్యేక దష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో ఏపిసిపిడిసిఎల్ ఎస్ఇ కె.వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, జిల్లా పరిషత్ సిఇఒ చిరంజీవి, ఎల్డిఎం రమేష్, సోలార్ విద్యుత్ ఏజెన్సీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బాపట్లను గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

డిఆర్ఒ గంగాధర్ గౌడ్


మాట్లాడుతున్న డిఆర్ఒ గంగాధర్‌గౌడ్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లాను గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్ కోరారు. కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో మాదకద్రవ్య నివారణ జిల్లా స్థాయి కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ పాఠశాలలు కళాశాలల్లో ఈగల్ టీంలు ఏర్పాటు చేసి మాదక ద్రవ్య వినియోగం వల్ల కలిగే నష్టాలను గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. మాదకద్రవ్యాల వినియోగం, అమ్మకాలపై కేసులు నమోదు చేయాలన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిస కావడం వల్ల వారు వ్యక్తిగతంగా నష్టపోవడంతో పాటు సమాజంలోనూ తీవ్రమైన దుష్పరిణామాలు, ఇబ్బందులు ఉత్పన్నమవుతున్నాయన్నారు. మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు రాష్ట్ర స్థాయిలోను, జిల్లా స్థాయిలోను పోలీసులను సమన్వయం చేసుకుంటూ సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పాఠశాలల్లోనూ, కళాశాలలోనూ,ఉన్నత విద్యా సంస్థల్లోనూ విద్యార్థులు ఆకర్షణలకు గురై మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా నిరంతరం అవగాహన, పర్యవేక్షణ కోసం పోలీస్ శాఖ నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం ఈగల్ క్లబ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లోనూ, పంచాయతీ, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులతోను ఈగల్ క్లబ్ లను ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నిషాముక్తి భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మత్తు పదార్థాల వినియోగం వలన కలిగే అనర్థాలపై యువతకు పూర్తిస్థాయిలో అవగాహన కలిగించేలా విద్యాసంస్థల్లో ఫ్లాష్ మాబ్‌లు, ర్యాలీలు, వివిధ రకాల పోటీలు నిర్వహించడానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. క్రైమ్ డిఎస్పి జగదీష్ నాయక్ మాట్లాడుతూ గంజాయి రవాణాను అరికట్టేందుకు ఈగల్ అనే ఆపరేషన్ సంస్థను రాష్ట్ర పోలీస్ శాఖ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో గంజాయి సరఫరా చేసేవారిని 64 మందిని గుర్తించినట్లు తెలిపారు. 275 మంది గంజాయి విక్రేతలను గుర్తించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, రవాణా శాఖ అధికారి పరంధామ రెడ్డి, పోర్టు అధికారి బివిఎం.మూర్తి, ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వెంకటేశ్వరరావు, ఎస్‌సి సంక్షేమ శాఖ అధికారి రాజ్ దేబోరా, వికలాంగుల సంక్షేమ అధికారి సువార్త, బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, షాడో స్వచ్ఛంద సంస్థ ఎన్‌జిఒ రాజా సాల్మన్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణను సక్రమంగా నిర్వహించండి

కలెక్టర్ తమీమ్ అన్సారియా


చెత్తను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నగరంలో ఇంటింటి నుంచి చెత్త సేకరణ సక్రమంగా నిర్వహించడంతో పాటు డ్రైనేజ్ క్లీనింగ్ ప్రక్రియ పటిష్టంగా చేపట్టాలని కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఒంగోలు నగరంలోని కోట వీధి, బలరాం కాలనీ, మిలటరీ కాలనీ, దిబ్బల రోడ్డు ప్రాంతాల్లో కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా సందర్శించి పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. తొలుత కలెక్టర్ బాపూజీ కాంప్లెక్స్ ఎదురగా వున్న కోట వీధిని సందర్శించి పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆ ప్రాంత ప్రజలతో మాట్లాడుతూ వారానికి ఎన్ని రోజులు ఇంటింటి చెత్త సేకరణ జరుగుచున్నది, చెత్త సేకరణకు శానిటేషన్ సిబ్బంది వస్తున్నారా లేదా, తడి చెత్త పొడి చెత్త వేరుచేస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పాత మార్కెట్ సెంటర్ లో పారిశుధ్య నిర్వహణ పై జిల్లా కలెక్టర్ అసంతప్తి వ్యక్తం చేస్తూ ఒంగోలు నగరంలో పారిశుధ్య నిర్వహణ కచ్చితంగా జరగాలన్నారు. నిర్లక్ష్యంగా విధులు నిర్వహిఒచిన శానిటేషన్ సిబ్బంది పై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. రహదారుల్లో మురుగునీరు నిల్వ కుండా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం బలరాం కాలనీ, మిలటరీ కాలనీని సందర్శించి పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. చెత్త సేకరణ జరుగుతున్నదని, మురుగు కాలువల క్లీనింగ్ జరగడం లేదని ఆ ప్రాంత ప్రజలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. వర్షా కాలం సీజన్ ప్రారంభమైనందున పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దష్టి సారించడంతో ప్రజలు పాటు డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వ్యాధుల బారీన పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మున్సిపల్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. దోమల నివారణ చర్యలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ప్రతి రోజు క్షేత్ర స్థాయిలో పర్యటించి పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని శానిటేషన్ అధికారులను ఆదేశించారు. అనంతరం దిబ్బల రోడ్డు ప్రాంతాన్ని సందర్శించి పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. కలెక్టర్ వెంట ఒంగోలు మున్సిపల్ కమిషనర్ కె. వెంకటేశ్వర రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి. వెంకటేశ్వర్లు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వైష్ణవి, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు .

పిటిసిని సందర్శించిన ఎస్‌పి



పిటిసిలో పరిశీలిస్తున్న ఎస్‌పి దామోదర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

పోలీసు శిక్షణా తరగతులు త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో ఒంగోలు కొత్త మామిడి పాలెంలోని పోలీస్ జిల్లా శిక్షణ కేంద్రాన్ని (పిటిసి) ఎస్‌పి దామోదర్ బుధవారం సందర్శించారు. పోలీసు అధికారులతో కలిసి ట్రైనింగ్ సెంటర్ పరిసర ప్రాంతాలు, మౌలిక సదు పాయాలు, బ్యారక్‌లు, తరగతి గదులు, పరేడ్ గ్రౌండ్ ప్రాంతాలను ఎస్‌పి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ శిక్షణ కోసం అవసరమైన సదుపాయాలను త్వరితగతిన అందుబాటులోకి తేవాలన్నారు. , అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శారీరక శిక్షణ, పరేడ్ ప్రాక్టీస్, ఇతర శిక్షణ కార్యక్రమాలకు ఉపయోగపడే గ్రౌండ్‌ను అభివృద్ధి చేయాలని ఎస్‌పి ఆదేశించారు. ఎస్సారు. మైదానం చదునుగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రన్నింగ్ ట్రాక్, డ్రిల్ ఏరియా, గార్డెన్ లాంటి సదుపాయాలను ప్రణాళికలో చేర్చాలని స్పష్టం చేశారు. నవీన పోలీసు సాంకేతికతలకు అనుగుణంగా శిక్షణా ప్రణాళికలను నవీకరించాల్సిన అవసరం ఉందన్నారు. అదనపు మౌలిక వసతుల ఏర్పాటు, వర్షపు నీరు నిల్వ కాకుండా డ్రెయినేజ్ ఏర్పాటు, శుభ్రతపై నిరంతర దష్టి అవసరమని అధికారులకు సూచించారు. ఎస్‌పి వెంట అడిషనల్ ఎస్‌పి (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఎఆర్ డిఎస్‌పి శ్రీనివాసరావు, టిడిసి ఇన్‌స్పెక్టర్ షమీముల్లా, టంగుటూరి ఎస్‌ఐ నాగమల్లేశ్వరరావు, ఆర్ఎస్ఐ, పోలీసు సిబ్బంది ఉన్నారు.